1st Happy Work Anniversary. Year

షణ్ముఖ
SHANMUKHAVELUGU
# వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు
తెలుగు దినపత్రిక


RNI : APTEL / 2023 / 89152

Good for Health
Best for Readers
THE POWER OF PEN

సంపుటి : 3 సంచిక : 110
శనివారం 25 ఏప్రిల్ 2026 పేజీలు 8 వెల : రూ.3

Printed by Ongole. Published From Ongle, Nellore, Guntur, Markapur, Bapatla.

# ఇది నాకు కూడా కొత్తగానే ఉంది



టీడీపీ క్లస్టర్ ఇంచార్జ్‌ల శిక్షణ శిబిరానికి హాజరైన పార్టీ అధినేత చంద్రబాబు
రాజకీయ పోరాటాలు చేశాను కానీ నేరగాళ్లతో పోరాడటం కొత్తగా ఉందని వ్యాఖ్యలు
వైసీపీ ఒక కిల్లర్ పార్టీ అని, వారి ఆలోచనా విధానాన్ని అధ్యయనం చేయాలని సూచన
దస్తగిరి హత్య, ఎమ్మెల్సీ అనంతబాబు ఉదంతాలను ప్రస్తావిస్తూ క్యాడర్‌ను అప్రమత్తం చేసిన సీఎం
కార్యకర్తలే టీడీపీకి అధినేతలని, ప్రతి ఒక్కరూ నాయకుడిగా ఎదగాలని పిలుపు



(షణ్ముఖ వెలుగు, అమరావతి,ఏప్రిల్ 24)

"నా సుదీర్ఘ రాజకీయ జీవితంలో ఎన్నో రాజకీయ పోరాటాలు చేశాను కానీ, నేరగాళ్లతో ఏనాడూ పోరాడలేదు. ప్రస్తుత పరిణామాల్లో క్రిమినల్స్‌తో రాజకీయం చేయాల్సిన పరిస్థితి రావడం నాకు కూడా కొత్తగానే ఉంది" అంటూ ముఖ్యమంత్రి, టీడీపీ అధినేత చంద్రబాబు ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన క్లస్టర్ ఇంఛార్జ్‌ల శిక్షణా తరగతుల్లో భాగంగా ఏర్పాటు చేసిన 'కాఫీ కబుర్లు' కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా సమకాలీన రాజకీయాలపై పార్టీ శ్రేణులకు ఆయన దిశానిర్దేశం చేశారు. వైసీపీని ఒక 'కిల్లర్ పార్టీ'గా అభివర్ణించిన చంద్రబాబు, ఆ పార్టీ ఆలోచనా విధానాన్ని ఎప్పటికప్పుడు అధ్యయనం చేస్తూ కౌంటర్ ఇవ్వాలని కార్యకర్తలకు సూచించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వైసీపీ అధికారంలో లేకపోయినా వారి అరాచకాలు కొనసాగుతున్నాయని ఆరోపించారు. ఇటీవల కడపలో జరిగిన దస్తగిరి హత్య, ఎమ్మెల్సీ అనంతబాబు వ్యవహారం వంటి ఘటనలను ఉదాహరణలుగా చూపించారు. "కడపలో ప్రభుత్వ భూముల పంపకాల్లో తేడాలు రావడంతో సొంత పార్టీ కార్యకర్త దస్తగిరినే హత్య చేశారు. డిప్యూటీ మేయర్ నిత్యానందరెడ్డి, ▶మిగతా 2లో

## దీదీ దిగిపోయే సమయం వచ్చింది అమిత్ షా



(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ,ఏప్రిల్ 24)

పశ్చిమబెంగాల్‌లో జరిగిన తొలి దశ ఎన్నికల్లో రికార్డు స్థాయిలో పోలింగ్ నమోదైంది. దీనిపై కేంద్ర హోంమంత్రి అమిత్‌షా స్పందిస్తూ.. ప్రజలు మార్పు కోరుకుంటున్నారని దీంతో స్పష్టమైందన్నారు. ఇక, దీదీ (సీఎం మమతా బెనర్జీని ఉద్దేశిస్తూ) దిగిపోయే సమయం ఆసన్నమైందన్నారు. కోల్‌కతాలో జరిగిన విలేకరుల సమావేశంలో అమిత్‌షా ఈ వ్యాఖ్యలు చేశారు.తొలి దశలో భాగంగా 152 సీట్లకు పోలింగ్ జరగ్గా.. అందులో 110కి పైగా స్థానాల్లో భాజపా విజయం సాధిస్తుందని కేంద్ర మంత్రి ధీమా వ్యక్తం చేశారు. 'మాకు అందిన సమాచారం ప్రకారం.. బెంగాల్ ప్రజలు తమ భవిష్యత్తును తొలి దశలోనే నిర్ణయించుకున్నారు. ప్రధాని మోదీ నాయకత్వంలోని అభివృద్ధికి వారు మొగ్గు చూపారు. తొలిదశ పోలింగ్ చూస్తే.. దీదీ దిగిపోయే సమయం వచ్చిందని, భాజపా అధికారాన్ని చేపట్టనుందనేది స్పష్టమవుతుంది' అని అమిత్‌షా అన్నారు. భాజపా అధికారంలోకి వస్తే.. పశ్చిమ బెంగాల్‌లో భయానక పాలనను అంతం చేస్తామని అమిత్‌షా పేర్కొన్నారు. చట్టబద్ధమైన పాలనను పునరుద్ధరిస్తామని హామీ ఇచ్చారు. మార్పు అంటే.. ▶మిగతా 2లో

## మే 4 ఫలితాల తర్వాత టీఎంసీ గూండాలకు దాక్కోవడానికి చోటు దొరకదు: ప్రధాని మోదీ



(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ,ఏప్రిల్ 24)

మే 4వ తేదీన ఎన్నికల ఫలితాలు వచ్చిన తర్వాత తృణమూల్ కాంగ్రెస్ పార్టీ గూండాలకు దాక్కోవడానికి బెంగాల్‌లో ఎక్కడా చోటు దొరకదని ప్రధాని నరేంద్రమోదీ అన్నారు. రెండో దశ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయన మాట్లాడుతూ, పశ్చిమ బెంగాల్ తొలి దశ పోలింగ్‌లో పెద్ద ఎత్తున ఓటర్లు పాల్గొన్నారని, ఇది ప్రజాస్వామ్య విజయంగా ఆయన అభివర్ణించారు. ఈ ఓటింగ్ శాతాన్ని చూసి టీఎంసీకి భయం పట్టుకుందని అన్నారు. ▶మిగతా 2లో

## సీఎం హామీపై దుష్ప్రచారం.. ఫేక్ వీడియోలపై మంత్రి లోకేష్ సీరియస్ వార్నింగ్

సీఎం చంద్రబాబు హామీపై సోషల్ మీడియాలో దుష్ప్రచారం
తప్పుడు ప్రచారాన్ని తీవ్రంగా ఖండించిన మంత్రి నారా లోకేష్




(షణ్ముఖ వెలుగు, అమరావతి,ఏప్రిల్ 24)

బ్యాటరీ ఆటో హామీపై అసలు వాస్తవాలను వెల్లడించిన ప్రభుత్వం ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన హామీని వక్రీకరించి సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేస్తున్న వారిపై మంత్రి నారా లోకేష్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వీడియోలను ఎడిట్ చేసి దుష్ప్రచారం చేసేవారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. వైసీపీ ఎన్నిసార్లు చెప్పినా తన తప్పుడు ప్రచారాల అలవాటును మార్చుకోవడం లేదని విమర్శించారు.

## రాఘవ్ చద్దా ఎఫెక్ట్: రాజ్యసభలో ఆప్ డీలా... పెరగనున్న బీజేపీ



(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ,ఏప్రిల్ 24)

ఆమ్ ఆద్మీ పార్టీకి (ఆప్) రాజ్యసభలో భారీ ఎదురుదెబ్బ తగిలింది. పార్టీ సీనియర్ నేత, ఎంపీ రాఘవ్ చద్దాతో పాటు మొత్తం ఏడుగురు రాజ్యసభ సభ్యులు బీజేపీలో చేరుతున్నట్టు ప్రకటించారు. రాఘవ్ చద్దాతో కలిసి ప్రముఖ క్రికెటర్ హర్భజన్ సింగ్, స్వాతి మలివాల్, అశోక్ మిట్టల్ వంటి ముఖ్య నేతలు కూడా పార్టీ మారడం ఢిల్లీ రాజకీయాల్లో సంచలనం సృష్టిస్తోంది. శుక్రవారం మీడియా సమావేశంలో మాట్లాడిన రాఘవ్ చద్దా, ఆప్‌లోని పది మంది రాజ్యసభ సభ్యుల్లో ▶మిగతా 2లో

## కృష్ణా తీరాన సింగపూర్ మెరుపులు... మెరీనా బ్యారేజీని పరిశీలించిన ఏపీ మంత్రులు

సింగపూర్ పర్యటనలో మెరీనా బ్యారేజీని సందర్శించిన ఏపీ మంత్రుల బృందం
వరద నియంత్రణ, నీటి సంరక్షణ విధానాలపై అధ్యయనం

(షణ్ముఖ వెలుగు, అమరావతి,ఏప్రిల్ 24)



ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిని ఆధునిక హంగులతో అభివృద్ధి చేసే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ఇందులో భాగంగా సింగపూర్ పర్యటనలో ఉన్న ఏపీ మంత్రుల బృందం, అక్కడి ప్రసిద్ధ మెరీనా బ్యారేజీని సందర్శించి అధ్యయనం చేసింది. వరద నియంత్రణ, నీటి సరఫరా, పర్యాటకాన్ని ఒకేచోట మేళవించిన ఈ బృహత్తర ప్రాజెక్టు నిర్మాణ శైలిని, నిర్వహణ విధానాలను మంత్రులు క్షుణ్ణంగా పరిశీలించారు.తమ సింగపూర్ పర్యటనలో నాలుగో రోజు హోంమంత్రి వంగలపూడి అనిత, మంత్రులు అచ్చెన్నాయుడు, బీసీ జనార్దన్ రెడ్డి, సత్యకుమార్ యాదవ్, అనగాని సత్యప్రసాద్ తదితరులు మెరీనా బ్యారేజీని సందర్శించారు. పర్యావరణానికి హాని కలగకుండా నీటి సమస్యలను అధిగమించడం, గ్రీన్ రూఫ్ వంటి కట్టడాలతో దీనిని ఒక పర్యాటక కేంద్రంగా ఎలా తీర్చిదిద్దారనే విషయాలను నేషనల్ యూనివర్సిటీ ఆఫ్ సింగపూర్ సిటీస్ డైరెక్టర్ ఖూ టెంగ్ చై మంత్రుల బృందానికి వివరించారు.ఈ పర్యటన అనంతరం హోంమంత్రి అనిత స్పందిస్తూ, మెరీనా బ్యారేజ్ ఎంతో స్ఫూర్తిదాయకంగా ఉందని తెలిపారు. అమరావతి రాజధాని ప్రాంతంలో, కృష్ణా నది తీరాన కూడా ఇటువంటి ఆధునిక అభివృద్ధి నమూనాలను అమలు చేసే అవకాశాలపై తమ బృందం చర్చించినట్లు వెల్లడించారు. ▶మిగతా 2లో

## కొత్త AI 'మిథోస్' కలకలం.. బ్యాంకర్లకు నిర్మలా సీతారామన్ హెచ్చరిక

'క్లాడ్ మిథోస్' అనే కొత్త AI సైబర్ భద్రతకు ముప్పుగా మారిందన్న ఆందోళనలు
నిర్మలా సీతారామన్ బ్యాంకర్లతో ఉన్నతస్థాయి సమావేశం
దశాబ్దాల నాటి లోపాలను సైతం ఈ AI గుర్తించగలదని నిపుణుల హెచ్చరిక



(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ,ఏప్రిల్ 24)

ముప్పును ఎదుర్కొనేందుకు పటిష్ఠమైన యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాలని బ్యాంకులకు ఆదేశం

"క్లాడ్ మిథోస్" అనే అత్యంత శక్తిమంతమైన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ మోడల్ వల్ల భారత బ్యాంకింగ్ రంగానికి పొంచి ఉన్న సైబర్ ముప్పుపై కేంద్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. ఈ నేపథ్యంలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ గురువారం వివిధ బ్యాంకుల అధిపతులతో ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించారు. ▶మిగతా 2లో

## విశ్రాంత ఉద్యోగులకు శుభవార్త

(షణ్ముఖ వెలుగు, అమరావతి,ఏప్రిల్ 24)

రాబోయే 100 రోజుల్లోగా విశ్రాంత ఉద్యోగులకు సంబంధించిన రూ.6,200 కోట్ల బకాయిలు చెల్లించాలని రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయించింది. మంత్రులు, కొందరు ప్రజాప్రతినిధులకు ఇచ్చే జీతాల్లో 50 శాతం నిలుపుదల చేసి.. వాటిని రిటైర్డ్ ఉద్యోగుల బకాయిల చెల్లింపు కోసం సిద్ధం చేసే నిధులతో కలిపి సర్దుబాటు చేయాలని తీర్మానించింది. తక్షణమే 'రెవెన్యూ రిసోర్సెస్ మొబిలైజేషన్ కమిటీ'ని ఏర్పాటు చేయాలని మంత్రివర్గం నిర్ణయం తీసుకుంది. ఈ కమిటీ ఆధ్వర్యంలో ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు, రిటైర్డ్ ఉద్యోగుల సంఘాలు, బాధ్యులైన వారందరినీ పిలిచి చర్చలు జరపాలని.. వీలైనంత




తొందరగా ఈ సమస్యను పరిష్కరించాలని నిర్ణయించింది. వచ్చే నెల 4న రాష్ట్ర మంత్రివర్గం మరోసారి సమావేశం కానుంది. ఆ రోజున.. ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగుల ప్రయోజనాలను ఎలా, ఎంత త్వరగా చెల్లించాలనే దానిపై మంత్రివర్గం స్పష్టమైన నిర్ణయం తీసుకోనుంది. ▶మిగతా 2లో

## శంకర్ గౌడ్ కుటుంబానికి రూ.10 లక్షల సాయం.. ఒకరికి ఉద్యోగం

(షణ్ముఖ వెలుగు, అమరావతి,ఏప్రిల్ 24)

ఆర్టీసీ సమ్మె నేపథ్యంలో ఆత్మహత్య చేసుకున్న డ్రైవర్ శంకర్ గౌడ్ కుటుంబాన్ని ప్రభుత్వం అన్నివిధాలా ఆదుకుంటుందని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. శంకర్ గౌడ్ కుటుంబంలో ఒకరికి



ఉద్యోగం ఇస్తామని మంత్రి తెలిపారు. ఆ కుటుంబానికి రూ.10 లక్షల సాయం, ఇందిరమ్మ ఇల్లు ఇస్తామని ప్రకటించారు. శంకర్ గౌడ్ అంత్యక్రియలు పూర్తయ్యేలా జేఏసీ నేతలు చొరవ తీసుకోవాలని కోరారు. ఆపత్కాలంలో రాజకీయాలు చేయవద్దని విపక్షాలకు సూచించారు.

మరోవైపు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అధ్యక్షతన సచివాలయంలో ఆర్టీసీ జేఏసీ నేతలతో మంత్రుల బృందం భేటీ అయింది. ఈ సమావేశంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్‌బాబు, వివేక్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పాల్గొన్నారు.

## మొదటి పేజీ తరువాయి

## ఇది నాకు కూడా కొత్తగానే ఉంది

జగన్ మేనమామ రవీంద్రనాథ్ రెడ్డి కలిసి ఈ దోపిడీకి పాల్పడ్డారు. వాళ్ల మనుషుల్ని వాళ్లే చంపుకుని, ఆ నేరాన్ని మనపై నెట్టే ప్రయత్నం చేస్తారు. ఇలాంటి వాటి పట్ల అత్యంత జాగ్రత్తగా ఉండాలి" అని చంద్రబాబు హెచ్చరించారు.

అదేవిధంగా, డ్రైవర్ సుబ్రహ్మణ్యంను హత్య ఉదంతాన్ని గుర్తుచేస్తూ, ఎమ్మెల్సీ అనంతబాబు సాక్షులను సైతం బెదిరించారని ఆరోపించారు. "రోడ్ల మీదకు వస్తారు, రెచ్చగొడతారు, ప్రజలను ఇబ్బందులు పెడతారు. చర్యలు తీసుకుంటే దాన్ని రాజకీయం అంటారు. అన్యాయం జరిగిందని పరామర్శకు వెళ్లి, సొంత కార్యకర్తలను కార్ల కింద తొక్కించి చంపుతారు. కానీ తన కారు కింద పడిన కార్యకర్తను మాత్రం పరామర్శించరు. ఇలాంటి పార్టీని నా జీవితంలో ఎప్పుడూ చూడలేదు" అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. 2019-24 మధ్య జరిగిన విధ్వంసాన్ని ప్రజలకు నిత్యం గుర్తుచేయాలని, అదే సమయంలో ప్రభుత్వం చేస్తున్న మంచి పనులను, వాటి అమలులో పడుతున్న కష్టాన్ని ప్రజలకు వివరించాలని కార్యకర్తలకు సూచించారు. "నన్ను అరెస్టు చేసినా, పార్టీని ఎన్ని ఇబ్బందులు పెట్టినా కార్యకర్తలను కాపాడుకున్నాను. టీడీపీలో కార్యకర్తలే అధినేతలు. ప్రతి కార్యకర్తను నాయకుడిగా తీర్చిదిద్దుతాం. రైట్ రాయల్‌గా బతకాలి. పార్టీ ఇచ్చే అవకాశాలను అందిపుచ్చుకుని మీరు ఎదగాలి" అని ఆయన పిలుపునిచ్చారు. సుదీర్ఘకాలం అధికారంలో ఉంటేనే అభివృద్ధి సాధ్యమవుతుందని, ప్రజలకు మంచి చేస్తే వారే మనల్ని గుర్తుంచుకుంటారని చంద్రబాబు హితవు పలికారు.

## విశ్రాంత ఉద్యోగులకు శుభవార్త

సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఆ నిర్ణయాలను మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, వాకిటి శ్రీహరిలతో కలిసి మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి విలేకరుల సమావేశంలో వెల్లడించారు. "ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన క్యాబినెట్ సమావేశంలో అనేక విషయాలపై సుదీర్ఘంగా చర్చించాం. సమ్మె విరమించాలని ఆర్టీసీ కార్మికులకు మంత్రివర్గం విజ్ఞప్తి చేస్తోంది. చర్చల ద్వారా సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉంది. మీ సమస్యలను పరిష్కరించాలనే ప్రభుత్వం అధికారుల కమిటీ వేసింది.

## సీఎం హామీపై దుష్ప్రచారం.. ఫేక్ వీడియోలపై మంత్రి లోకేష్ సీరియస్ వార్నింగ్

అసలేం జరిగిందంటే..

తిరుపతి జిల్లా నాయుడుపేటలో మార్చి 30న జరిగిన టిడ్కో ఇళ్ల గృహప్రవేశాల కార్యక్రమంలో సీఎం చంద్రబాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముక్కర అంబిక అనే లబ్ధిదారురాలి ఇంటికి వెళ్లి సత్యనారాయణ స్వామి వ్రతంలో పాలుపంచుకున్నారు. ఆమె భర్త ఆటో డ్రైవర్ అని తెలుసుకుని, ఆయనకు జీవనోపాధి కోసం ఒక బ్యాటరీ ఆటోను ఇప్పించాలని జిల్లా కలెక్టర్‌ను అక్కడికక్కడే ఆదేశించారు.

వక్రీకరణ ఇలా..

?సీఎం ఆ ఇంటి నుంచి బయటకు వస్తుండగా, ఎదురుగా ఉన్న మరో ఇంటి వద్ద ఒక మహిళ తన చదువుకున్న కుమారుడికి ఉద్యోగం ఇప్పించాలని కోరారు. అయితే కొందరు ఈ రెండు వేర్వేరు సంఘటనలను కలిపి, 'చదువుకున్న యువకుడికి ఆటో కొనిపెడతారట' అంటూ అపహాస్యం చేస్తూ వీడియోలను ఎడిట్ చేసి సోషల్ మీడియాలో ప్రచారం చేస్తున్నారని లోకేష్ తెలిపారు.

గతంలోనే ఈ అంశంపై ఏపీ ప్రభుత్వ ఫ్యాక్ట్ చెక్ విభాగం ద్వారా వివరణ ఇచ్చామని, అయినా మళ్లీ అదే అంశంపై దుష్ప్రచారం చేయడం దురుద్దేశపూర్వకమని ఆయన అన్నారు. వీడియోలను తప్పుడు అర్థం వచ్చేలా ఎడిట్ చేసి ప్రచారం చేయడం చట్టరీత్యా నేరమని, ఇలాంటి చర్యలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తప్పవని మంత్రి నారా లోకేష్ స్పష్టం చేశారు.

## కొత్త AI 'మిథోస్' కలకలం.. బ్యాంకర్లకు నిర్మలా సీతారామన్ హెచ్చరిక

ఈ భేటీలో ఐటీ శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ కూడా పాల్గొన్నారు. ఆంత్రోపిక్ అనే స్టార్టప్ అభివృద్ధి చేసిన 'క్లాడ్ మిథోస్' సైబర్ భద్రత విషయంలో అత్యంత అధునాతనమైనదిగా పేరుపొందింది. మనుషులు గుర్తించడంలో విఫలమైన వేలాది సైబర్ భద్రతా లోపాలను ఇది కనుగొన్నట్లు సమాచారం. కొన్ని ఆపరేటింగ్ సిస్టమ్స్‌లో 27 ఏళ్లుగా ఉన్న లోపాలను కూడా ఇది బయటపెట్టింది. అందుకే దీన్ని సాధారణ ప్రజలకు అందుబాటులోకి తీసుకురాలేదు. ఒకవేళ ఇది చెడు ఉద్దేశాలున్న వారి చేతికి చిక్కితే, అధునాతన హ్యాకింగ్ సామర్థ్యాలు పొందినట్లేనని ఆంత్రోపిక్ హెచ్చరించింది. ఈ నేపథ్యంలో కొందరు అనధికారికంగా ఈ ూ×ని యాక్సెస్ చేశారన్న వార్తలు ఆందోళన రేపుతున్నాయి.

ఈ ముప్పు అసాధారణమైనదని, బ్యాంకులు, ఆర్థిక సంస్థల మధ్య అత్యంత జాగరూకత, సమన్వయం అవసరమని ఆర్థిక మంత్రిత్వ శాఖ 'ఎక్స్' వేదికగా పేర్కొంది. బ్యాంకులు తమ ఐటీ వ్యవస్థలను పటిష్ఠం చేసుకోవాలని, వినియోగదారుల డేటాను కాపాడేందుకు ముందస్తు చర్యలు తీసుకోవాలని నిర్మలా సీతారామన్ ఆదేశించారు. ముప్పును నిజ సమయంలో గుర్తించి, దాని వివరాలను బ్యాంకులు, ఇండియన్ కంప్యూటర్ ఎమర్జెన్సీ రెస్పాన్స్ టీమ్ (జజు=ు-×అ) వంటి సంస్థల మధ్య పంచుకోవడానికి ఒక బలమైన యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాలని సూచించారు. తక్షణమే స్పందించేందుకు వీలుగా ఒక సమన్వయ సంస్థాగత యంత్రాంగాన్ని అభివృద్ధి చేయాలని ఇండియన్ బ్యాంక్స్ అసోసియేషన్ కు మంత్రి సూచించారు.

కేవలం భారత్‌లోనే కాకుండా, అమెరికా ప్రభుత్వం కూడా 'మిథోస్' ముప్పుపై వాల్‌స్ట్రీట్ బ్యాంకులతో చర్చలు జరుపుతోంది. మరోవైపు, ఈ ూ× వల్ల భారత ఆర్థిక రంగానికి ఎంత మేరకు ప్రమాదం ఉందనే అంశంపై ఆర్థిక మంత్రిత్వ శాఖ, రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (=దీ×) అధ్యయనం చేస్తున్నాయి.

## రాఘవ్ చద్దా ఎఫెక్ట్: రాజ్యసభలో ఆప్ డీలా... పెరగనున్న బీజేపీ

ఏడుగురు సభ్యులం బీజేపీలో విలీనం కావాలని నిర్ణయించుకున్నట్లు ప్రకటించారు.

ఎంపీలు అశోక్ మిట్టల్, సందీప్ పాఠక్‌లతో కలిసి మీడియా సమావేశంలో మాట్లాడిన రాఘవ్ చద్దా, తమ వర్గం బీజేపీలో విలీనం అవుతున్నట్లు అధికారికంగా వెల్లడించారు. "రాజ్యాంగంలోని నిబంధనలకు అనుగుణంగా, రాజ్యసభలోని ఆప్ సభ్యుల్లో మూడింట రెండొంతుల మందిమి బీజేపీలో విలీనం కావాలని నిర్ణయించుకున్నాం" అని ఆయన స్పష్టం చేశారు.

కాగా, ఈ పరిణామంతో రాజ్యసభలో బీజేపీ బలం మరింత పెరగనుంది. ప్రస్తుతం బీజేపీ 106 మంది సభ్యులతో పెద్దల సభలో అతిపెద్ద పార్టీగా కొనసాగుతోంది. తాజాగా ఆప్ నుంచి ఏడుగురు ఎంపీల చేరికతో బీజేపీ బలం 113కి పెరగనుంది. అంతేకాదు, మిత్రపక్షాలతో కలిపి బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే కూటమి బలం 125కి చేరుతుంది.

కొన్ని రోజుల క్రితమే రాఘవ్ చద్దాను రాజ్యసభలో పార్టీ డిప్యూటీ లీడర్ పదవి నుంచి ఆప్ అధిష్ఠానం తొలగించింది. ఆయన స్థానంలో అశోక్ మిట్టల్‌ను నియమించింది. అయితే, ఇప్పుడు చద్దాతో పాటు ఆ కొత్త డిప్యూటీ లీడర్ అశోక్ మిట్టల్ కూడా బీజేపీలో చేరనుండడం గమనార్హం. పార్టీతో విభేదాల నేపథ్యంలో ఇటీవల చద్దా తన పార్లమెంటరీ పనితీరును వివరిస్తూ ఓ వీడియోను సోషల్ మీడియాలో పోస్ట్ చేయడం అప్పట్లో చర్చనీయాంశమైంది. ఈ తాజా పరిణామంతో ఆప్‌లో అంతర్గత సంక్షోభం తీవ్రస్థాయికి చేరినట్లు స్పష్టమవుతోంది.

## దీదీ దిగిపోయే సమయం వచ్చింది: అమిత్ షా

చొరబాటు రహిత బెంగాల్‌గా మార్చడమేనన్నారు. అవినీతి, బుజ్జగింపులు, దోపిడీల నుంచి స్వేచ్ఛ, యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడమన్నారు. ప్రభుత్వ ఏర్పాటు తర్వాత మహిళల భద్రతకు అధిక ప్రాధాన్యం ఇస్తామన్నారు.

అవన్నీ వదంతులే..

బెంగాల్‌లో భాజపా అధికారంలోకి వస్తే.. పాలన బయట నుంచి ఉంటుందంటూ మమతా బెనర్జీ (మీుఎమీు దీుఅవతీయవవ) వదంతులు వ్యాపింపజేస్తున్నారని విమర్శించారు. 'దీదీ గారు.. మీకు ఒకటి చెప్పాలి. ఇక్కడే పుట్టి, బెంగాలీలో చదువుకుని, ఆ భాషను మాట్లాడగలిగేవారే.. బెంగాల్‌లో తర్వాతి సీఎం అవుతారు. అయితే, అది మీ మేనల్లుడు (అభిషేక్ బెనర్జీని ఉద్దేశిస్తూ) కాదు. ఆ ముఖ్యమంత్రి ఒక భాజపా కార్యకర్త' అని అమిత్‌షా అన్నారు.

## మే 4 ఫలితాల తర్వాత టీఎంసీ గూండాలకు దాక్కోవడానికి చోటు దొరకదు: ప్రధాని మోదీ

ఎన్నికల ఫలితాల తర్వాత రాష్ట్ర ప్రజలకు జరిగిన ప్రతి అన్యాయానికి, దౌర్జన్యానికి సంబంధించిన ఫైల్స్‌ను బయటకు తీస్తామని హెచ్చరించారు. ఈ రాష్ట్రం విప్లవాల గడ్డ అని గుర్తుంచుకోవాలని అన్నారు. ఎన్నికల ఫలితాల తర్వాత టీఎంసీ గూండాలను ఎవరూ కాపాడలేరని అన్నారు. మమతా బెనర్జీ సాగిస్తున్న అటవిక పాలనకు చరమగీతం పాడే సమయం ఆసన్నమైందని అన్నారు.

మొదటి దశలో పోలింగ్ రికార్డు స్థాయిలో నమోదు కావడం పట్ల మోదీ హర్షం వ్యక్తం చేశారు. ఎన్నికల ప్రక్రియపై ప్రజలకు ఉన్న విశ్వాసాన్ని ఇది ప్రతిబింబిస్తోందని అన్నారు. తృణమూల్ కాంగ్రెస్ మహిళా వ్యతిరేక పార్టీ అని విమర్శించారు. బెంగాల్‌లో మహిళలకు గౌరవం, భద్రత, సాధికారత కల్పించడమే తమ లక్ష్యమని అన్నారు.

## సెమిస్టర్ ఫలితాల్లో శ్రీ హర్షిణి పీజీ విద్యార్థుల విజృంభణ విశ్వవిద్యాలయ స్థాయిలో టాపర్స్‌గా కీర్తి




(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఏప్రిల్ 24)

శ్రీ హర్షిణి డిగ్రీ, పీజీ కళాశాల విద్యార్థులు ఆంధ్ర కేసరి విశ్వవిద్యాలయం నిర్వహించిన ద్వితీయ సంవత్సరం, మూడవ సెమిస్టర్ పరీక్షలలో అద్భుతమైన ప్రతిభ కనబరిచి విశ్వవిద్యాలయ స్థాయిలో టాపర్స్‌గా నిలిచి కళాశాలకు విశేష గౌరవాన్ని తెచ్చారు. తమ కృషి, పట్టుదలతో విద్యార్థులు సాధించిన ఈ ఘన విజయం కళాశాల చరిత్రలో మరో మైలురాయిగా నిలిచింది. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ గోరంట్ల రవికుమార్ మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన కఠోర శ్రమతో ఉన్నత లక్ష్యాలను సాధించడం గర్వకారణమని పేర్కొన్నారు. విద్యార్థుల ఈ విజయానికి అధ్యాపకుల అంకితభావం, సమర్థ మార్గదర్శకత్వం మరియు కళాశాలలో నెలకొన్న ఉత్తమ విద్యా వాతావరణమే మూలాధారమని ఆయన అన్నారు. అలాగే సెక్రటరీ , కరస్పాండెంట్ గోరంట్ల కవిత ,, మేనేజింగ్ డైరెక్టర్ గోరంట్ల హర్షిత్, విద్యార్థులను హృదయపూర్వకంగా అభినందిస్తూ, భవిష్యత్తులో మరింత ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. కళాశాల డీన్ డి ఆంజనేయులు, ప్రిన్సిపల్ ఎం నాగేంద్ర, విద్యార్థుల ప్రతిభను ప్రశంసిస్తూ, నిరంతర సాధనతో దేశానికి ఆదర్శప్రాయులుగా ఎదగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కంప్యూటర్ సైన్స్ విభాగానికి చెందిన కే గోపాల కృష్ణమూర్తి, వి సుబ్బారావు, ఫిజిక్స్ విభాగానికి చెందిన ఏ గోపీకృష్ణరెడ్డి, కెమిస్ట్రీ విభాగానికి చెందిన కె హేమ, బి రాజేష్, గణిత విభాగానికి చెందిన ఎన్ సోలోమన్, ఎట ఎస్ ప్రతాప్, ధీరిష్, యు నాంచారమ్మ, ఇతర అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొని టాపర్స్‌ను అభినందించారు. ఈ సందర్భంగా విద్యార్థులు తమ విజయానికి తోడ్పడిన తల్లిదండ్రులు, అధ్యాపకులకు కృతజ్ఞతలు తెలియజేశారు. భవిష్యత్తులో మరిన్ని విశిష్ట విజయాలు సాధించి కళాశాల ప్రతిష్టను మరింతగా పెంచాలని సంకల్పం వ్యక్తం చేశారు.

## శాప్ లీగ్స్ బాక్సింగ్ టోర్నమెంట్ విజయవంతం




(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఏప్రిల్ 24)

ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ ఆదేశాల మేరకు ప్రకాశం జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి "శాప్ లీగ్స్ బాక్సింగ్ టోర్నమెంట్" డాక్టర్ పి ఆనంద్ మినీ స్టేడియం నందు ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమం జిల్లా క్రీడాకారుల ప్రతిభను వెలికితీసే వేదికగా నిలిచింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ అధికారి జి రాజరాజేశ్వరి, బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఎస్ సురేష్, ఫుట్‌బాల్ కోచ్ పాల్ కుమార్, సపక్ తగడ శిక్షకుడు బి శ్రీనివాసులు, బాక్సింగ్ శిక్షకులు పాణ్యం వేణు, కుమారి కె కృష్ణవేణి హాజరయ్యారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులు మాట్లాడుతూ యువత క్రీడల వైపు మరింత ఆసక్తి చూపాలని, క్రమశిక్షణతో పాటు ఆరోగ్యాన్ని మెరుగుపర్చుకోవడానికి క్రీడలు ఎంతో అవసరమని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల నుంచి కూడా ప్రతిభావంతులైన క్రీడాకారులు వెలుగులోకి రావడం ఆనందదాయకమని, వారికి అన్ని విధాలుగా ప్రోత్సాహం అందిస్తామని పేర్కొన్నారు. క్రీడాకారులు రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించి జిల్లా పేరు ప్రతిష్టలు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ టోర్నమెంట్‌లో అండర్-15 మరియు అండర్-19 బాల, బాలికల విభాగాల్లో అనేక మంది క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. క్రీడాకారులు తమ ప్రతిభను ప్రదర్శించి ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. ఈ నెల 28వ తేదీ నుండి 30వ తేదీ వరకు విశాఖపట్నంలో నిర్వహించబడనున్న శాప్ లీగ్స్ రాష్ట్ర స్థాయి బాక్సింగ్ టోర్నమెంట్‌లో పాల్గొనడానికి రెండు విభాగాల్లో మొత్తం 12 మంది క్రీడాకారులు ఎంపికయ్యారు. కార్యక్రమం ముగింపులో విజేతలకు అభినందనలు తెలియజేసి, రాష్ట్ర స్థాయి పోటీలలో విజయం సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో కోచ్‌లు, నిర్వాహకులు, క్రీడాకారుల పాత్ర ప్రశంసనీయమని నిర్వాహకులు తెలిపారు.

## టీడీపీ కార్యాలయంలో ఘనంగా నక్కా శ్రీను జన్మదిన వేడుకలు

(షణ్ముఖ వెలుగు, యర్రగొండపాలెం, ఏప్రిల్ 24)




పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయం బుధవారం సందడిగా మారింది. ఒంగోలు పార్లమెంట్ ఐటీడీపీ అధ్యక్షులు, రాష్ట్ర రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ నక్కా శ్రీను జన్మదిన వేడుకలను ఆయన మిత్ర బృందం, పార్టీ నాయకులు మరియు కార్యకర్తలు ఎంతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో నక్కా శ్రీనుకు పార్టీ నాయకులు శాలువాలు కప్పి ఘనంగా సత్కరించారు. పార్టీ బలోపేతానికి ఆయన చేస్తున్న కృషిని ఈ సందర్భంగా పలువురు కొనియాడారు. అనంతరం నక్కా శ్రీను కేక్ కట్ చేయగా, తోటి నాయకులు, అభిమానులు ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. చేకూరి సుబ్బారావు మార్కెట్ యార్డ్ చైర్మన్ పోట్ల గోవిందు పుల్లలచెరువు మండల టీడీపీ అధ్యక్షులు కామేపల్లి వెంకటేశ్వర్లు టీడీపీ సీనియర్ నాయకులు వీరితో పాటు బోడిరెడ్డి, ఆనంద్, చిన్న, పవన్, యల్లయ్య తదితర నాయకులు, కార్యకర్తలు ఈ వేడుకల్లో పాల్గొని నక్కా శ్రీనుకు శుభాకాంక్షలు తెలియజేశారు.





ప్రకాశం | మార్కాపురం | బాపట్ల

షణ్ముఖ **వెలుగు**

ప్రతి వార్త వెలుగు వైపు — తెలుగు దినపత్రిక

25.04.26 శనివారం


## ఒంగోలు జాతి ఎడ్ల రాష్ట్రానికి ప్రత్యేక గుర్తింపు

### రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్

**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఏప్రిల్ 24)**

నాగులుప్పలపాడు మండలం మద్దిరాలపాడు గ్రామంలో నిర్వహించిన ఒంగోలు జాతి ఎడ్ల బలప్రదర్శన కార్యక్రమంలో శుక్రవారం రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ముఖ్య



అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఒంగోలు జాతి ఎడ్లు రాష్ట్రానికి ప్రత్యేక గుర్తింపు తెచ్చిన అరుదైన సంపదగా నిలిచాయని పేర్కొన్నారు. రైతులు ఈ జాతిని సంరక్షిస్తూ, అభివృద్ధి చేసేందుకు ముందుకు రావాలని సూచించారు. (తరువాయి 4లో...)

## జిల్లాలో జలజీవన్ మిషన్ పనులు వేగవంతంగా పూర్తి చేయడానికి చర్యలు తీసుకోవాలి

### జిల్లా కలెక్టర్ ఎం విజయ సునీత



**(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, మార్కాపురం, ఏప్రిల్ 24)**

జిల్లాలో జలజీవన్ మిషన్ పథకం కింద చేపట్టిన పనులు వేగవంతంగా పూర్తి చేయడానికి చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎం.విజయ సునీత అధికారులను ఆదేశించారు. శుక్రవారం స్థానిక కలెక్టర్ ఛాంబర్‌లో జిల్లా వాటర్ అండ్ శానిటేషన్ మిషన్ కమిటీ సమావేశం జిల్లా కలెక్టర్ అధ్యక్షత న జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ (తరువాయి 4లో...)

## సమస్యల సత్వర పరిష్కారానికే పల్లె నిద్ర

### జిల్లా కలెక్టర్ పి రాజాబాబు





**(షణ్ముఖ వెలుగు, చీమకుర్తి, ఏప్రిల్ 24)**

గ్రామస్థాయిలో ప్రజలతో ముఖాముఖి చర్చించి వారి సమస్యలను సత్వరం పరిష్కరించేందుకే ‘ పల్లెనిద్ర ’ కార్యక్రమాన్ని చేపట్టినట్లు జిల్లా కలెక్టర్ పి రాజాబాబు చెప్పారు. శుక్రవారం ఆయన చీమకుర్తి మండలంలోని చంద్రపాడు గ్రామంలో పల్లెనిద్ర కార్యక్రమంలో పాల్గొన్నారు. స్థానిక ఎమ్మెల్యే బి ఎన్ విజయ్ కుమార్, జాయింట్ కలెక్టర్ కల్పనా కుమారిలతో కలిసి గ్రామస్తులతో ప్రత్యేకంగా సమావేశం నిర్వహించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వారు ప్రస్తావించిన సమస్యలను ఓపికతో విని వాటి పరిష్కారానికి అప్పటికప్పుడే అధికారులకు ఆయన ఆదేశాలు జారీ చేశారు. గ్రామ అభివృద్ధిలో, ప్రత్యేకంగా పారిశుధ్య నిర్వహణలో (తరువాయి 4లో...)

# ప్రైవేటు పాఠశాలలకు ధీటుగా చదివితేనే ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు మంచి భవిష్యత్తు



### దాతల సహకారంతోనే విద్యార్థులకు ఉచితంగా సైకిళ్ళు
### నాణ్యమైన మధ్యాహ్న భోజనం, తల్లికి వందనం బాధ్యత అధికారులదే
### ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లల్ని చేర్పించండి
### ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్

**(షణ్ముఖ వెలుగు, అద్దంకి, ఏప్రిల్ 24)**

ప్రైవేటు పాఠశాల విద్యార్థులకు ధీటుగా చదివితేనే ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు మంచి భవిష్యత్తు ఉంటుందని మంత్రి గొట్టిపాటి రవి కుమార్ తెలిపారు. అద్దంకి నియోజకవర్గంలోని బల్లికురవ మండలంలో శుక్రవారం నాడు మంత్రి గొట్టిపాటి పర్యటించారు. ముక్తేశ్వరం, చెన్నుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలకు చెందిన సుమారు 96 మంది విద్యార్థులకు మంత్రి గొట్టిపాటి ఉచితంగా సైకిళ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడిన ఆయన కష్టపడి చదివి ఉన్నత స్థానాలకు వెళ్లాలని సూచించారు. సీఎం చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలోని కూటమి ప్రభుత్వంలో పాఠశాల విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు ఉచితంగా యూనిఫాం, పుస్తకాలు, బ్యాగు, షూస్ కూడా అందిస్తున్నామన్నారు. తల్లికి వందనం ద్వారా చదువుకునే విద్యార్థులు ఒక్కొక్కరికీ సంవత్సరానికి రూ.15,000 జమ చేసినట్లు చెప్పారు. అద్దంకి నియోజకవర్గంలోనే ఇప్పటి వరకు దాతల సహకారంతో సుమారు 11,200పైగా సైకిళ్లను విద్యార్థులకు అందించామన్నారు. గతంలో ఒక్కో పాఠశాలకు ఒక్క టీచర్ ఉండేవారని దాని వలన విద్యార్థులు ఇబ్బంది పడేవారని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వంలో విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ ఆధ్వర్యంలో డీఎస్సీ ద్వారా ఒకేసారి 16,400 టీచర్ పోస్టులను భర్తీ చేశారని, దీనితో అందరికీ నాణ్యమైన విద్య అందుబాటులోకి వచ్చిందని మంత్రి పేర్కొన్నారు. నాణ్యమైన మధ్యాహ్న భోజనంతో పాటు విద్యార్థులందరికీ తల్లికి వందనం అందేలా చూడాల్సిన బాధ్యత ఎంఈవోదే అని ఆయన స్పష్టం చేశారు. గ్రామ పెద్దలు కూడా అప్పుడప్పుడు పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం చేసి నాణ్యత పరీక్షించాలని కోరారు. అదే విధంగా అందరికీ రైతు భరోసా అందుతుందా., ఉపాధి హామీ సరిగా అమలవుతుందా అనే విషయాల్లో సచివాలయ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లల్ని చేర్పించండి అని పిలుపునిచ్చిన మంత్రి గొట్టిపాటి., దీనికి అందరూ బాధ్యత తీసుకోవాలని సూచించారు. (తరువాయి 4లో...)

# గిరిజన సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాం

### రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ బొజ్జి రెడ్డి




**(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, మార్కాపురం, ఏప్రిల్ 24)**

జిల్లాలో ఉద్యోగాల భర్తీ లో రూల్ ఆఫ్ రిజర్వేషన్లు అమలు చేయాలని రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ సొల్లా బొజ్జిరెడ్డి అధికారులను ఆదేశించారు. శుక్రవారం పట్టణంలోని కె ఆర్ గ్రాండ్ రెసిడెన్సి ఫంక్షన్ హాల్‌లో రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ జిల్లాలో అమలు జరుగుతున్న సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలపై జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ జిల్లాలో ఎస్టీ ప్రజలకు ఉద్యోగాల నియామకాల్లో రిజర్వేషన్లు తప్పకుండా అమలు చేయాలని అందుకు విరుద్ధంగా వ్యవహరించిన అధికారులపై చర్యలు తీసుకుంటామని ఆయన చెప్పారు. కొత్త జిల్లా కాబట్టి కొంత సమయం ఇస్తున్నామని అధికారులు రికార్డులు సవరించుకోవాలన్నారు. జిల్లాలో గిరిజన సంక్షేమం కోసం అవసరమైన నిధులు రాబట్టడానికి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు. జిల్లాలో గిరిజన ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ కు సూచించారు. గిరిజన ప్రాంతాల్లో జీవనోపాదులు మెరుగుపరచడానికి పాడి గేదెలు, గొర్రెల సంబంధించిన రుణాలు పంపిణీ చేయాలని అధికారులకు సూచించారు. గిరిజన ఆశ్రమ పాఠశాలలను, వసతి గృహాలను మరమ్మతులు చేయించి సుందరంగా తీర్చిదిద్దాలని అధికారులను ఆదేశించారు. గిరిజన ప్రజలకు అవసరమైన గృహ నిర్మాణాలు మంజూరు చేయాలని గృహ నిర్మాణ శాఖ అధికారులకు చైర్మన్ సూచించారు. గతంలో నిర్మించుకున్న గృహాలకు బిల్లులు మంజూరు చేయాలన్నారు. జిల్లాలో ఎస్సీ ఎస్టీ కేసుల వివరాలను బాధితులకు అందించిన నష్టపరిహార వివరాలను అధికారులు అడిగి తెలుసుకున్నారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ ఎం విజయ సునీత, రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యులు కే లక్ష్మి, సి వెంకటప్ప, కే మల్లేశ్వరరావు, జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి వరలక్ష్మి, నాయుడు శ్రీశైలం ఐడిడీఓ పిఓ పీవీఎస్ నాయుడు, ఆర్డీవో ప్రభాకర్, డీఎస్పీ నాగరాజు, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యమే లక్ష్యం

### రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి



**(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, ఒంగోలు, ఏప్రిల్ 24)**

పంచాయతీ రాజ్ వ్యవస్థలో అనేక సంస్కరణలు తీసుకువచ్చి గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యమే లక్ష్యంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పనిచేస్తున్నదని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టరేట్ లోని పిజిఆర్ఎస్ హాల్లో జరిగిన జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవ వేడుకల్లో రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డా డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి స్వామి, ఒంగోలు ఎంపి మాగుంట శ్రీనివాసులురెడ్డి, జిల్లా కలెక్టర్ పి రాజాబాబు, ఒంగోలు, సంతనూతలపాడు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్‌రావు, బిఎన్ విజయకుమార్‌లతో కలసి పాల్గొన్నారు. రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి స్వామి మాట్లాడుతూ మహాత్మాగాంధీ పల్లె సీమలు అభివృద్ధి చెందాలి, గ్రామా స్వరాజం రావాలని నినాదం తీసుకురాగా, డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గ్రామ సీమలు ప్రత్యేకంగా అభివృద్ధి చెందాలని రాజ్యాంగంలో పొందపర్చడం జరిగిదన్నారు. స్థానిక పాలనా వ్యవహారాలను సమర్ధవంతంగా నిర్వహించడంలో పంచాయతీరాజ్ వ్యవస్థ ప్రాధాన్యతను గుర్తించి ప్రత్యేక రాజ్యాంగ సవరణ ద్వారా పంచాయతీరాజ్ వ్యవస్థకు చట్టబద్ధత తీసుకురాగా, ఆనాటి నుండి ప్రతి ఏటా ఏప్రిల్ 24న జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవాన్ని నిర్వహించుకుంటున్నట్లు తెలిపారు. గ్రామాలు ప్రగతి పథంలో నడిచినప్పుడే దేశాభివృద్ధి సాధ్యం అవుతుందన్నారు. క్షేత్ర స్థాయిలో మౌలిక వసతుల కల్పన, సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల అమలు, నిధుల వినియోగం లాంటి అంశాలను సమన్వయం చేయడం కోసమే పంచాయతీ రాజ్ వ్యవస్థ ఏర్పాటు అయినట్లు తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ గ్రామాల అభివృద్ధి కి ప్రత్యేక శ్రద్ద తీసుకోవడంతో పాటు పంచాయతీ వ్యవస్థలో సమూలంగా మార్పులు తీసుకురావడం జరిగిందన్నారు. స్వర్ణ గ్రామంలో ప్రత్యేక సిబ్బందిని నియమించడంతో పాటు వారి పర్యవేక్షణకు మండల, జిల్లా స్థాయి అధికారులను కూడా నియమించి పూర్తి స్థాయిలో అభివృద్ధి సంక్షేమాన్ని సమర్ధవంతంగా నిర్వహించేలా చర్యలు తీసుకోవడం జరుగుచున్నదన్నారు. గుండమాల పంచాయతీకు జాతీయ స్థాయిలో అవార్డు రావడం పట్ల సంబంధిత పంచాయతీ కార్యదర్శి లావణ్యను ప్రత్యేకంగా మంత్రి అభినందించారు. గ్రామీణ స్థాయిలో పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు. అలాగే క్షేత్ర స్థాయిలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న, అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల ఫలాలు పూర్తిస్థాయిలో అర్హులైన గ్రామీణ ప్రజలకు అందేలా పంచాయత్ వ్యవస్థ పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. ఒంగోలు ఎంపి మాగుంట శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ పంచాయతీ రాజ్ వ్యవస్థ గ్రామాల అభివృద్ధికి పట్టుకొమ్మలన్నారు. ప్రత్యేక రాజ్యాంగ సవరణ ద్వారా పంచాయతీ రాజ్ వ్యవస్థ రావడంతో మహాత్మాగాంధీ కలలు కన్న గ్రామస్వరాజ్యం స్థాపనకు నాంది పలికిందన్నారు. కేంద్రం నుండి గ్రామం వరకు నిధుల కేటాయింపు అయ్యేలా చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పంచాయతీరాజ్ వ్యవస్థ బలోపేతానికి కృషి చేస్తూ వికసిత్ భారత్, వికసిత్ ఆంధ్రప్రదేశ్ వైపు అడుగులు వేస్తున్నట్లు తెలిపారు. గుండమాల పంచాయత్‌కు జాతీయ స్థాయిలో అవార్డు రావడం మనందరికీ గర్వకారణమని, ఈ సందర్భంగా అవార్డుకు కృషి చేసిన పంచాయతీ సెక్రెటరీని అభినందిస్తూ వారిని ఆదర్శంగా తీసుకుని ప్రతి ఒక్కరూ పనిచేయాలన్నారు. జిల్లా కలెక్టర్ ప్రత్యేకంగా పల్లె నిద్ర కార్యక్రమం నిర్వహించడం అభినందిస్తూ, ఈ పల్లె నిద్ర కార్యక్రమం గ్రామీణ ప్రజల సమస్యలు పరిష్కారానికి ఎంతో (తరువాయి 4లో...)

# ఒంగోలు జాతి ఎడ్ల రాష్ట్రానికి ప్రత్యేక గుర్తింపు





పశుసంవర్ధక రంగం బలోపేతానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. గ్రామీణ సంప్రదాయాలను ప్రతిబింబించే ఇటువంటి కార్యక్రమాలు యువతలో అవగాహన పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని మంత్రి అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పార్టీ అధ్యక్షులు, కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి, సంతనూతలపాడు ఎమ్మెల్యే బిఎన్ విజయ్ కుమార్, జిల్లా గ్రంధాలయ చైర్పర్సన్ ముప్పవరపు సుచిత్ర వీరయ్య చౌదరి, బాపట్ల పార్లమెంట్ అధ్యక్షులు సలగలా రాజశేఖర్, పోతినేని శ్రీనివాసరావు (పియస్ఆర్), తదితరులు పాల్గొన్నారు.

# గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యమే లక్ష్యం





దోహదపడుతుందన్నారు. జిల్లా కలెక్టర్ పి రాజాబాబు మాట్లాడుతూ గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్ స్థాపనను నిజం చేయడానికి పంచాయతీరాజ్ వ్యవస్థను తీసుకురావడం జరిగిందన్నారు. గ్రామ స్వరాజ్ స్థాపనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. పట్టణాలతో పాటు గ్రామీణ ప్రాంతాలు అభివృద్ధి చెందినప్పుడే దేశం ఇతోధికంగా అభివృద్ధి చెందుతుందన్న లక్ష్యంతో గ్రామాల అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పంచాయతీ రాజ్ వ్యవస్థకు అత్యంత ప్రాధ్యానత ఇస్తున్నట్లు తెలిపారు. పరిపాలనను గ్రామీణ ప్రజలకు మరింత చేరువ చేయడానికి నేడు ఈ గవర్నెన్స్, వాట్సప్ గవర్నెన్స్ను రాష్ట్ర ప్రభుత్వం తీసుకురావడం జరిగిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం స్వచ్ఛతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమాన్ని ప్రతి నెలా మూడవ శనివారం నిర్వహించుకోవడం జరుగుచున్నదన్నారు. స్వచ్ఛత అనేది ఆత్మగౌరవానికి నిదర్శనం అని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు గ్రామ స్థాయిలో పటిష్టంగా అమలు కావడంతో పాటు వాటి ఫలాలు సంపూర్ణంగా గ్రామీణ ప్రజలకు అందేలా పంచాయతీరాజ్ వ్యవస్థ పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. లావణ్య కృషితో నేడు జాతీయ స్థాయిలో గుండమాల పంచాయతీకి అవార్డు రావడం జరిగింది. అవార్డు రావడానికి చేసిన కృషిని డాక్యుమెంటేషన్ చేసి దాని అన్నీ గ్రామా పంచాయతీలకు అమలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. క్షేత్ర స్థాయిలో పంచాయతీరాజ్ వ్యవస్థ పటిష్టంగా పనిచేసేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్రావు మాట్లాడుతూ భారత రాజ్యాంగలో 73వ సవరణ ద్వారా 1992 ఏప్రిల్ 24న పంచాయతీ రాజ్ వ్యవస్థను ఏర్పాటుచేయడం జరిగిందన్నారు. ఏ పంచాయతీకి ఆ పంచాయతీ అభివృద్ధి జరగాలన్న ఉద్దేశ్యంతో పంచాయతీరాజ్ వ్యవస్థను తీసుకువచ్చినట్లు తెలిపారు. గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణ, తాగునీటి వసతి, విద్య, వైద్య సదుపాయాలు, రోడ్లు, గృహ నిర్మాణాలు తదితర మౌలిక సదుపాయాల కల్పన పంచాయతీ రాజ్ వ్యవస్థ ద్వారానే అమలు జరుగుచున్నవన్నారు. కొత్తపట్నం మండలం, గుండమాల పంచాయతీకి జాతీయ స్థాయిలో అవార్డు రావడం ఎంతో సంతోషకరమన్నారు. జాతీయ స్థాయిలో అవార్డు రావడానికి కృషి చేసిన పంచాయతీ సెక్రటరీ లావణ్యను ప్రత్యేకంగా అభినందిస్తూ, వీరిని ప్రతిఒక్కరు ఆదర్శంగా తీసుకుని పనిచేయాలన్నారు. ఆనాడు జన్మభూమి కార్యక్రమం ద్వారా సిమెంటు రోడ్లు నిర్మాణాలు పెద్ద ఎత్తున చేపట్టడం జరిగిందన్నారు. నేడు ప్రతి పంచాయతీ లో 7 నుండి 8 మంది అధికారులు పనిచేస్తున్నారు. అలాగే పెద్ద మొత్తం లో నిధులు కూడా కేటాయించడం జరుగుచున్నదని, ప్రజల భాగస్వామ్యం తో గ్రామాల అభివృద్ధికి పంచాయతీ రాజ్ శాఖ సిబ్బంది కృషి చేయాలన్నారు. సంతనూతలపాడు ఎమ్మెల్యే బి ఎన్ విజయకుమార్ మాట్లాడుతూ పరిపాలనలో పంచాయతీ వ్యవస్థ చాలా ప్రాధాన్యత కలిగివున్నదన్నారు. గ్రామ స్థాయిలో అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు పంచాయతీ రాజ్ వ్యవస్థ ద్వారా అమలు జరుగుచున్నవన్నారు. ఏ కార్యక్రమం విజయవంతంగా అమలు కావాలన్నా ప్రజల భాగస్వామ్యం అవసరమన్నారు. గ్రామీణ ప్రజల మౌలిక వసతుల కల్పనలో పంచాయతీరాజ్ వ్యవస్థ కీలకమని, పంచాయతీరాజ్ వ్యవస్థ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి మాట్లాడుతూ గ్రామాలు బాగుంటేనే దేశం బాగుంటుంది ఆనాటి గాంధీజీ ఆలోచనను నిజంచేస్తూ రాష్ట్ర ముఖ్యమంత్రి, ప్రధాన మంత్రి గ్రామాల బలోపేతానికి కృషి చేస్తున్నారన్నారు. భారత దేశ పౌరుడుగా గ్రామాల అభివృద్ధిలో భాగస్వామ్య కావాలన్నారు. అనంతరం జిల్లా పరిషత్ సిఈఓ చిరంజీవి అందరిచే ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం పంచాయతీరాజ్ వ్యవస్థలో విశేష కృషి చేసిన సిబ్బందికి మెరిట్ సర్టిఫికేట్స్ అందచేసారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ సిఈఓ చిరంజీవి, డిపిఓ వెంకటేశ్వరరావు, డ్వామా పిడి జోసెఫ్ కుమార్, ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఈ నాగేశ్వరరావు, మెప్మా పిడి విజయలక్ష్మి, జిల్లాలోని డిఎల్డిఓలు, ఎంపిడిఓలు, పంచాయతీ వ్యవస్థ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## భవన నిర్మాణ కార్మికులు సభ్యత్వం నమోదు చేయించుకోవాలి

### పేరుపోగు జార్జి



(షణ్ముఖ వెలుగు, మాచర్ల టౌన్, ఏప్రిల్ 24) మాచర్ల పెన్షన్ అసోసియేషన్ భవన్ నందు దళిత బహుజన భీమ్ సేన రాష్ట్ర అధ్యక్షులు పేరుపోగు జార్జి మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికులు సభ్యత్వం నమోదు చేసుకోవాలన్నారు. కార్మికులైన ప్రతి ఒక్కరూ కార్మిక శాఖ ఆఫీస్ నందు నమోదు చేసుకోవాలని కార్మికుల సంక్షేమ పథకాలు సద్వినియోగం చేసుకోవాలని మాచర్ల పెన్షన్ భవనం నందు మాట్లాడారు. ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలకు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు యర్రసాని జకరయ్య మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కార్మికుల కార్డులు ప్రతి ఒక్కరు నమోదు చేసుకోవాలన్నారు. పాత కార్డులు రెన్యువల్ చేయించుకోవాలని కార్మికుల హక్కులు ప్రతి ఒక్కరిది అని అన్నారు. భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఖమ్మంపాటి మోషే మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికులు ఈ యొక్క కార్డు పేదవారికి ఆసరాగా ఉంటుందన్నారు. ఈ కార్డు ద్వారా ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. డప్పు, జానపదం కళాకారులు ఆదిరాల ఆదాం, పెయింట్ మేస్త్రి రత్నం, తదితరులు పాల్గొన్నారు.

## ప్రకృతి వ్యవసాయంతోనే వర్షాభావ పరిస్థితుల అధిగమనం

### మండల వ్యవసాయ అధికారి జోష్నాదేవి




(షణ్ముఖ వెలుగు, తర్లుపాడు, ఏప్రిల్ 24) ప్రస్తుత ఏడాది పసిఫిక్ మహాసముద్రంలో ఏర్పడిన ఎల్నినో ప్రభావం వల్ల వర్షాలు తక్కువగా కురిసే అవకాశం ఉందని, రైతులు అప్రమత్తంగా ఉండి ప్రకృతి వ్యవసాయ పద్ధతులు అవలంబించాలని మండల వ్యవసాయ అధికారి పి జోష్నాదేవి సూచించారు. తర్లుపాడు గ్రామ సచివాలయంలో వ్యవసాయ, ఏపిసిఎన్ఎఫ్ సిబ్బందికి రెండు రోజుల పాటు నిర్వహించిన శిక్షణ కార్యక్రమం శుక్రవారంతో ముగిసింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వర్షాభావ పరిస్థితులను తట్టుకోవడానికి ప్రకృతి వ్యవసాయమే సరైన మార్గమని పేర్కొన్నారు. ఫార్మర్ మాస్టర్ ట్రైనర్ మేరీమణి రైతులకు ఉపయోగపడే విత్తన గుళికల తయారీని, ప్రకృతి వ్యవసాయంలో వాడే వివిధ రకాల కషాయాల తయారీ విధానాన్ని ప్రత్యక్షంగా చేసి చూపించారు. ఈ కార్యక్రమంలో మండలంలోని రైతు భరోసా కేంద్రాల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# సమస్యల సత్వర పరిష్కారానికే పల్లె నిద్ర




ప్రజలు కూడా తమ వంతు బాధ్యత నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. బహిరంగ మలవిసర్జన సరికాదన్నారు. పొదుపు సంఘాల మహిళలతో కలెక్టర్ ప్రత్యేకంగా మాట్లాడి గ్రూప్ రుణాలను ఏ విధంగా సద్వినియోగం చేసుకుంటున్నారో అడిగి తెలుసుకున్నారు.

**గ్రామ సమస్యలు ఇవీ...** గ్రామంలో తాగునీటి సమస్య ఉంది. వాటర్ ట్యాంకు సామర్థ్యం సరిపోవడం లేదు. ట్యాంకర్ సక్రమంగా రావడం లేదు. నేలటూరు రోడ్డు బాగా దెబ్బ తిన్నది. మరమత్తులు చేపట్టాల్సిన అవసరం ఉంది. రెగ్యులర్ విద్యుత్ లైన్మెన్ లేకపోవడం వలన విద్యుత్ సరఫరాలో అంతరాయం కలిగితే, విద్యుత్ సరఫరా పునరుద్ధరణ ఆలస్యం కావడంతో గ్రామస్థులు ఇబ్బంది పడుతున్నారు. రెగ్యులర్ లైన్మెన్ను నియమించాలి. వేరే ఆధార్ నెంబర్తో అన్నదాత - సుఖీభవ పథకం నగదు పొందుతున్నారు. అర్హులైన వారందరికీ అమలు చేయాలి. స్వచ్ఛ భారత్ కింద మరుగుదొడ్లు ఉన్నప్పటికీ బహిరంగ మలవిసర్జన జరుగుచున్నది. గ్రామంలో బహిరంగ మలవిసర్జనను అరికట్టాలి. చంద్రపాడు గ్రామంలో సైడు కాలువలు నిర్మించాల్సిన అవసరం ఉంది. అలాగే స్మశాన వాటిక ఆక్రమణకు గురైంది. దాన్ని సరిచేయాలి. అలాగే పొలానికి వెళ్ళే డొంక రోడ్డు పాడైంది. మరమత్తులు చేపట్టాల్సిన అవసరం ఉంది. గ్రామంలో చాలా వరకు ఒక్కొక్క ఇంటిలో రెండు, మూడు కుటుంబాలు జీవిస్తున్నాయి. కొత్తగా ఇళ్లు మంజూరు చేయాలి. కుటుంబ సభ్యుల మ్యాపింగ్లో లోపం వలన ప్రభుత్వ పథకాలు రావడం లేదు. ఈ సమస్యను పరిష్కరించాలి. ఈ సమస్యల పరిష్కారానికి తక్షణమే దృష్టి సారించి చర్యలు తీసుకోవాలని, అవసరమైన ప్రతిపాదనలు రూపొందించాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఎమ్మెల్యే బి ఎన్ విజయ్కుమార్ మాట్లాడుతూ చంద్రపాడు గ్రామానికి కలెక్టర్, జాయింట్ కలెక్టర్, ఇతర అధికార యంత్రాంగం రావడం పై కృతజ్ఞతలు తెలిపారు. ఆర్థిక సంబంధమైనవి కాని సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ఇళ్ల స్థలాలు, స్మశాన సమస్యను పరిష్కరించాలన్నారు. అవసరం మేరకు స్కూల్, అంగన్వాడీలలో నిర్మాణ పనులు, గుడిపాడుకు రోడ్డు, తదితర సదుపాయాలను కూడా త్వరగా చేపట్టేలా చూడాలని కోరారు. జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ ఈ గ్రామంలో రీసర్వే కార్యక్రమం జరుగుతోందన్నారు. అర్హులైన రైతులు వినియోగించుకోవాలని ఆమె కోరారు. రెవెన్యూ సమస్యలపై ప్రత్యేక దృష్టి పెట్టామన్నారు. ముందుగా గ్రామంలోని సీతారామ స్వామి ఆలయంలో ప్రత్యేకంగా నిర్వహించిన పూజా కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ వెంట ఆర్డీవో లక్ష్మీ ప్రసన్న, జడ్పీ సీఈవో చిరంజీవి, డిపిఓ వెంకటేశ్వరరావు, వివిధ శాఖల జిల్లా, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.




# జిల్లాలో జలజీవన్ మిషన్ పనులు వేగవంతంగా పూర్తి చేయడానికి చర్యలు తీసుకోవాలి



జిల్లాలో ప్రతి ఇంటికి త్రాగునీటి కుళాయిని అందించడానికి ప్రభుత్వం 2028 డిసెంబర్ నాటికి లక్ష్యంగా నిర్ణయించిందన్నారు. జిల్లాలో జలజీవన్ మిషన్ క్రింద2వేల225 పనులు 1780కోట్ల రూపాయలతో ప్రభుత్వం మంజూరు చేయడం జరిగిందని కలెక్టర్ చెప్పారు. జలజీవన్ మిషన్ క్రింద హనుమంతునిపాడు, పుల్లల చెరువు, త్రిపురాంత కం మండలాల్లో 18.2 కోట్ల రూపాయలతో త్రాగునీటి పథకాలను అభివృద్ధి చేయడానికి ప్రతిపాదన ప్రభుత్వా న్ని పంపడానికి చర్యలు తీసుకున్నా మని ఆమె చెప్పారు. జల జీవన్ మిషన్ క్రింద 119గ్రామాల్లో త్రాగునీటి పైపులను పునరుద్ధరించడానికి 30.5 కోట్ల రూపాయ లతో ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపను న్నట్లు ఆమె చెప్పారు. జిల్లాలో త్రాగునీటి పథకాల పరిశీలించ డానికి టెక్నికల్ సిబ్బందిని ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో ఇరిగేషన్ శాఖ ఎస్ఈ అబూత్ అలీ, జిల్లా గ్రామీణ నీటి సరఫరా శాఖ ఈఈ సురేష్ బాబు, జిల్లామహిళా శిశుసంక్షేమశాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ పద్మావతి, తదితరులు పాల్గొన్నారు.

# ప్రైవేటు పాఠశాలలకు ధీటుగా చదివితేనే ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు మంచి భవిష్యత్తు

**రూ.8 వేల కోట్లతో ఆర్డీఎస్ఎస్ పనులు...**

అద్దంకి నియోజకవర్గంలోని బల్లికురవలో శ్రీసీతారామ ఆంజనేయ స్వామి ఆలయానికి మంత్రి గొట్టిపాటి రవికుమార్ శుక్రవారం నాడు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ ప్రజల రూ.50 లక్షల విరాళాలకు తోడుగా ఆలయ నిర్మాణానికి కూటమి ప్రభుత్వం రూ.1 కోటి సీజీఎఫ్ నిధులను మంజూరు చేసిందన్నారు. అనంతరం బల్లికురవ ఎస్సీ కాలనీకి చేరుకున్న మంత్రి గొట్టిపాటి., 30 ఇళ్లపై ఏర్పాటు చేసిన సోలార్ రూఫ్ టాప్ యూనిట్లను ప్రారంభించారు. రాష్ట్రవ్యాప్తంగా 20 లక్షల సోలార్ కనెక్షన్లు ఇవ్వాలన్న లక్ష్యంగా ముందుకు వెళ్తున్నామన్నారు. 200 యూనిట్లలోపు విద్యుత్ వినియోగించే 6 లక్షల ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు 2కేవీ సామర్థ్యం కలిగిన రూ.1.25 లక్షల విలువైన సోలార్ యూనిట్లను ఉచితంగానే అందిస్తున్నామని తెలిపారు. 3 కేవీ సామర్థ్యం కలిగిన సోలార్ కనెక్షన్ తీసుకునే బీసీలకు రూ.98 వేలు, ఓసీలకు రూ.78 వేలు సబ్సిడీ అందిస్తామని ఆయన స్పష్టం చేశారు. సోలార్ రూఫ్ టాప్ యూనిట్ల కోసం ముందుకు వచ్చే అందరికీ కనెక్షన్లు మంజూరు చేస్తామని చెప్పారు. అదే విధంగా రూ.8 వేల కోట్లతో రాష్ట్రవ్యాప్తంగా ఆర్డీఎస్ఎస్ పనులు చేపడుతున్నామని మంత్రి గొట్టిపాటి పేర్కొన్నారు. ఆర్డీఎస్ఎస్ పనులు పూర్తి అయితే గ్రామాల్లోనూ 24 గంటల నాణ్యమైన విద్యుత్ సరఫరా, రైతులకు పగటి పూటే 9 గంటల విద్యుత్ అందుబాటులోకి వస్తుందని వెల్లడించారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, కూటమి నేతలు పాల్గొన్నారు.





# వాహనదారులు ప్రయాణ సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలి

## జిల్లా ఎస్పీ వి హర్షవర్ధన్ రాజు



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఏప్రిల్ 24)

వేసవి కాలంలో అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్న పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని వాహనదారులు ప్రయాణ సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ వి హర్షవర్ధన్ రాజు అన్నారు. వాహనదారులు రోడ్డు భద్రత నియమాలు తప్పనిసరిగా పాటించాలన్నారు. సురక్షిత ప్రయాణం కోసం వాహన పరిస్థితి చెక్ చేయాలన్నారు. వేసవి కాలంలో ఉష్ణోగ్రతలు అధికంగా నమోదవుతున్న నేపథ్యంలో వాహనదారులు ప్రయాణాల సమయంలో తగిన జాగ్రత్తలు పాటించాలని జిల్లా ఎస్పీ శ్రీ వి.హర్షవర్ధన్ రాజు,ఐపీఎస్.,గారు ఒక ప్రకటనలో సూచించారు. ప్రకాశం, మార్కాపురం జిల్లాల ప్రాంతాల్లో వాహనదారులు భద్రతకు ప్రాధాన్యతనిస్తూ ముందస్తు చర్యలు తీసుకోవడం అవసరమన్నారు. వాహనాన్ని నడిపే ముందు అన్ని టైర్ల పరిస్థితిని పరిశీలించడం తప్పనిసరి అని, టైర్లలో గాలి, పాత లేదా దెబ్బతిన్న టైర్లను వెంటనే మార్చుకోవాలని సూచించారు. అలాగే వాహనం యొక్క ఇంజిన్ కండిషన్ సరిగా ఉందో లేదో ముందుగానే చెక్ చేయడం ద్వారా ప్రయాణంలో ఇబ్బందులు తలెత్తకుండా ఉంటాయని తెలిపారు. ఎండాకాలంలో ఇంజిన్ వేడెక్కే అవకాశాలు ఎక్కువగా ఉండటంతో, రేడియేటర్‌లో తగినంత నీరు ఉండేలా చూసుకోవాలని, కూలింగ్ సిస్టమ్ సక్రమంగా పనిచేస్తుందో లేదో చూసుకోవడం ద్వారా వాహనం ఓవర్‌హీట్ కావడం నివారించవచ్చని తెలిపారు. ఎక్కువ దూరం ప్రయాణాలు చేసే వారు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రత్యేకంగా 100 కిలోమీటర్ల దూరం ప్రయాణించిన తరువాత కొంత సమయం విశ్రాంతి తీసుకోవడం మంచిదని, ఈ విరామ సమయంలో వాహనాన్ని మళ్లీ చెక్ చేసుకోవాలని సూచించారు. డ్రైవర్‌లు అలసటకు గురికాకుండా ఉండేందుకు ఈ విరామాలు చాలా అవసరమని తెలిపారు. అలసటతో డ్రైవింగ్ చేయడం ప్రమాదాలకు దారితీసే అవకాశం ఉన్నందున జాగ్రత్తగా వ్యవహరించాలని హెచ్చరించారు. అలాగే ప్రయాణ సమయంలో తగినంత నీరు తీసుకోవడం, శరీరాన్ని హైడ్రేట్‌గా ఉంచుకోవడం కూడా ముఖ్యమని సూచించారు. అవసరమైతే ప్రయాణాన్ని ఉదయం లేదా సాయంత్రం సమయాల్లో ప్లాన్ చేసుకోవడం ద్వారా ఎండ తీవ్రతను తగ్గించుకోవచ్చని తెలిపారు. వాహనదారులు ఈ సూచనలు పాటించడం ద్వారా ప్రమాదాలను తగ్గించుకోవడంతో పాటు, సురక్షితంగా గమ్యస్థానానికి చేరుకోవచ్చని జిల్లా ఎస్పీ తెలిపారు. జిల్లా పోలీస్ శాఖ రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యంగా పనిచేస్తుందని జిల్లా ఎస్పీ గారు తెలిపారు. రోడ్డు భద్రత నియమాలను ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలని, బాధ్యతతో వ్యవహరించాలని విజ్ఞప్తి చేశారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, మద్యం సేవించి వాహనాలు నడపకూడదని, రాంగ్ డైరెక్షన్‌లో ప్రయాణించడం ద్వారా ప్రమాదాలకు దారితీస్తుందన్నారు. అలాగే అతివేగంగా వాహనాలను నడపకూడదని, రోడ్డు, ట్రాఫిక్ నియమాలను పాటించాలని, డ్రైవింగ్ సమయంలో ఫోన్ వాడకూడదని, సీటుబెల్ట్ ధరించడం తప్పనిసరి అన్నారు. ప్రతి ఒక్కరూ సహకరిస్తేనే రోడ్డు ప్రమాదాలను తగ్గించవచ్చని, ప్రజల భద్రతకు జిల్లా పోలీస్ శాఖ నిరంతరం కృషి చేస్తుందని జిల్లా ఎస్పీ తెలిపారు.

# తాగునీటి సమస్య లేకుండా చూడాలి



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఏప్రిల్ 24)

స్థానిక గ్రామ పంచాయతీలో గ్రామ పంచాయతీ భవనం ఆవరణంలో స్పెషల్ ఆఫీసర్ పి సుజాత అధ్యక్షతన జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవం సందర్భంగా గ్రామ సభ ఏర్పాటు చేయడం జరిగింది. ఈ గ్రామ సభలో ప్రత్యేక అధికారి సుజాత మాట్లాడుతూ గ్రామ పంచాయతీలో శానిటేషన్ కార్యక్రమాలు ప్రతి రోజు చేయాలని క్లాప్ మిత్రలకు సూచనలు ఇచ్చారు. అదే విధంగా డ్రింకింగ్ వాటర్ సమస్యలు లేకుండా చూసుకోవాలని పిడిఓకి పలు సూచనలు ఇచ్చారు. తదుపరి గ్రామ నాయకులు మండవ ప్రసాద్ ,మండవ మురళి మాట్లాడుతూ గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవాలని గ్రామ ప్రజలకు తెలియజేశారు. తదుపరి గ్రామ పంచాయతీ కార్యదర్శి ముప్పరాజు నారాయణకి గ్రామ నాయకులు సన్మాన కార్యక్రమం చేశారు. తదుపరి గ్రామంలో పనిచేస్తున్న క్లాప్ మిత్ర లకు, స్వీపర్‌లకు సన్మానం చేసి స్వీట్ బాక్స్, ప్రతి ఒక్కరికి 25 కిలోల బియ్యం బస్తా 9 మందికి అందజేశారు. ఈ కార్యక్రమంలో గంధం స్వప్న, పంచాయతీ కార్యదర్శి ముప్పరాజు నారాయణ, సచివాలయం సిబ్బంది, ఫీల్డ్ అసిస్టెంట్ ఆదాము, చుండి సింగయ్య, గంధం నరసయ్య, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# పాలీసెట్ ఎంట్రన్స్ పరీక్షకు ఉచిత బస్సు సౌకర్యం




(షణ్ముఖ వెలుగు, చీరాల, ఏప్రిల్ 24)

సెయింట్ ఆన్స్ కాలేజ్ ఆఫ్ టెక్నాలజీ చీరాలలో శనివారం నిర్వహించి పాలీసెట్ ఎంట్రన్స్ పరీక్షలకు చుట్టుపక్కల గ్రామాల నుండి ఉచిత బస్సు సౌకర్యం ఏర్పాటు చేసినట్లు కళాశాల సెక్రటరీ వనమా రామకృష్ణారావు కరస్పాండెంట్ శ్రీమంతుల లక్ష్మణరావు ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ కి జగదీష్ బాబు మాట్లాడుతూ ఏప్రిల్ 25న సెయింట్ ఆన్స్ కళాశాలలో జరిగే పాలీసెట్ ఎంట్రన్స్ పరీక్షకు చిన్నగంజాం, కడవకుదురు, పందిళ్ళపల్లి మీదుగా కళాశాలకు, చీరాల రైల్వే స్టేషన్, జాండ్రపేట వేటపాలెం మీదుగా కళాశాలకు, ఈపురుపాలెం, పేరాల బైపాస్ మీదుగా కళాశాలకు, చీరాల మసీద్ సెంటర్ కొత్తపేట నుండి కళాశాలకు మొత్తం నాలుగు ఉచిత బస్సులను ప్రవేశ పరీక్ష అభ్యర్థుల సౌకర్యార్థం ఏర్పాటు చేయడం జరిగింది అన్నారు. ఈ ఉచిత బస్సులో కదా అని అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అలాగే అభ్యర్థుల ఎవరికైనా పాలీసెట్ అప్లై చేసిన హాల్ టికెట్ రానివాళు ఉదయం 8 గంటలకు ముందుగానే కేంద్రానికి చేరుకుని హాల్ టికెట్ పొందవచ్చునని తెలిపారు.

# విద్యార్థిని, విద్యార్థులకు విలువలతో కూడిన విద్యను అందించాలి

### నారాయణ విద్యాసంస్థల వార్షికోత్సవ సభలో రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి స్వామి వెల్లడి



(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, ఒంగోలు, ఏప్రిల్ 24)

విద్యార్థిని, విద్యార్థులకు ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు విలువలతో కూడిన విద్యను అందించాలని నారాయణ విద్యాసంస్థల వార్షికోత్సవ సభలో రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి అన్నారు. శుక్రవారం ఒంగోలు నగరంలోని ధారా వారి తోటలో ఉన్న నారాయణ ఒలంపియాడ్ నందు జరిగిన అంకుర వార్షికోత్సవ దినోత్సవ వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి వార్షికోత్సవ సభలో ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. మంత్రి డాక్టర్ స్వామి మాట్లాడుతూ ఆ రోజుల్లో తల్లిదండ్రులు తాతలు, విద్యార్థులకు నీతులు చెప్పేవారని అలానే ఉపాధ్యాయులు కూడా అదే రీతిలో విద్యను అందించే వారిని అలాంటి విద్యను మరల అందించగలిగితేనే విద్యార్థిని విద్యార్థులకు భవిష్యత్ తరాలకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. విద్యార్థుల భవిష్యత్తుకు సంబంధించి ఉత్తేజమైన మాటలతో విద్యార్థులను కొనియాడారు. అనంతరం పాఠశాల అకాడమీ స్పోర్ట్స్ సంబంధించి ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు మెమెంటోలు, ప్రశంస పత్రాలను మంత్రి చేతుల మీదుగా అందజేశారు. విద్యార్థిని, విద్యార్థుల ఆధ్వర్యంలో జరిగిన సాంస్కృత కార్యక్రమాలు, కరాటి ప్రదర్శనలు అందరిని ఆకట్టుకునేలా చేసాయి. అంతకు ముందు జ్యోతి ప్రజ్వలతో కార్యక్రమాన్ని మంత్రి స్వామి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నారాయణ విద్యాసంస్థల యజమాన్యం క్లస్టర్ ప్రిన్సిపాల్ వాక వేదవతి, ప్రిన్సిపాల్ వేలూరి సాయి నిరూప తేజ, విద్యాసంస్థల కోఆర్డినేటర్ తల్లిదండ్రులు, విద్యార్థిని, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ సరఫరా నాణ్యత పెంపు దిశగా బల్లికురవ మండలం

### మంత్రి గొట్టిపాటి ఆదేశాలతో ఆధునికీకరణ పనులు పూర్తి

(షణ్ముఖ వెలుగు, అద్దంకి, ఏప్రిల్ 24)



విద్యుత్ సరఫరా నాణ్యత పెంపు దిశగా బల్లికురవ మండలంలో విస్తృత ఆధునీకరణ పనులు పూర్తయ్యాయి. రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఆదేశాలతో రూ.4.15 కోట్ల వ్యయంతో బల్లికురవ, ముక్తేశ్వరం, సూరేపల్లి, చెన్నుపల్లి గ్రామాలలో చేపట్టిన విద్యుత్ వ్యవస్థ అభివృద్ధి పనులు విజయవంతంగా పూర్తి అయ్యాయి. గతంలో మంత్రి బల్లికురవ మండల పర్యటన సందర్భంగా స్థానికులు ఎదుర్కొంటున్న విద్యుత్ అంతరాయాలు, పాడైపోయిన లైన్ల సమస్యలను ప్రత్యక్షంగా తెలియజేయగా, వెంటనే స్పందించిన మంత్రి అధికారులకు సమగ్ర ఆధునీకరణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఆ ఆదేశాల మేరకు గ్రామాల వారీగా విస్తృత పనులు చేపట్టబడ్డాయి. బల్లికురవ గ్రామంలో పాత స్తంభాలు, లైన్లు తొలగించి వాటి స్థానంలో 320 నూతన స్తంభాలు, 5 ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయడంతో పాటు రూ.1.12 కోట్లు ఖర్చు చేశారు. చెన్నుపల్లి గ్రామంలో 589 నూతన స్తంభాలు, 4 ట్రాన్స్‌ఫార్మర్లు మరియు నూతన విద్యుత్ లైన్లు ఏర్పాటు చేసి రూ.1.73 కోట్లు వ్యయం చేశారు. ముక్తేశ్వరం గ్రామంలో 135 నూతన స్తంభాలు, 3 ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసి రూ.51 లక్షలు ఖర్చు చేశారు. సూరేపల్లి గ్రామంలో 265 నూతన స్తంభాలు, 2 ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసి రూ.79 లక్షలు వ్యయం చేశారు. పనులు పూర్తయ్యిన సందర్భంగా ఈ రోజు మంత్రి గొట్టిపాటి రవికుమార్ స్వయంగా గ్రామాలను సందర్శించి నిర్వహించిన అభివృద్ధి కార్యక్రమాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో అద్దంకి డివిజన్ విద్యుత్‌శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నల్లూరి మస్తాన్‌రావు, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎం సురేంద్ర బాబు, అసిస్టెంట్ ఇంజనీర్ కెవి సుబ్బారావు, సిబ్బంది, మండల తెలుగుదేశంపార్టీ నాయకులు ఇజ్రాయిల్, శంకర్, గొట్టిపాటి లక్ష్మయ్య, గొట్టిపాటి కిషోర్, సారధి, అంజిబాబు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు గౌరవ విద్యుత్ శాఖ మంత్రికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

# 27న పర్చూరులో జిల్లా స్థాయి ప్రజా సమస్యల పరిష్కార వేదిక

(షణ్ముఖ వెలుగు, మార్టూరు, ఏప్రిల్ 24)

పర్చూరులో ఈ నెల 27న జిల్లా స్థాయి ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించబడుతుందని పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు క్యాంప్ కార్యాలయం తెలిపింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఏలూరి క్యాంపు సిబ్బంది మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమ పథకాలతో పాటు సమస్య ఏదైనా పరిష్కారం కోసం సోమవారం 27న పర్చూరు కొల్లా వారి కళ్యాణ మండపం నందు జిల్లా స్థాయి ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించబడుతుందన్నారు. ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ప్రత్యేక చొరవతో జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్‌తో పాటు జిల్లా అధికార యంత్రాంగం మొత్తం ఈ కార్యక్రమానికి హాజరుకానున్నారని తెలిపారు. ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకుంటారని అభివృద్ధి, సంక్షేమ పథకాల పై సందేహాలు ఉన్నా, వ్యక్తిగత, గ్రామీణ సమస్యలైనా, ఏ సమస్య అయినా ఈ వేదికలో పరిష్కారం దొరుకుతుందన్నారు. జిల్లా, నియోజకవర్గ ప్రజలందరూ తప్పక హాజరై గ్రీవెన్స్‌ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



## జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా గోపవరం గ్రామంలో ప్రత్యేక గ్రామసభ



(షణ్ముఖ వెలుగు, గోపవరం, ఏప్రిల్ 24) జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా గోపవరం గ్రామ పంచాయతీలో ప్రత్యేక గ్రామసభ నిర్వహించారు. ఈ సమావేశం ఎంపిడిఓ, స్పెషల్ ఆఫీసర్ వి శ్రీధర్ ఆధ్వర్యంలో పంచాయతీ డెవలప్మెంట్ ఆఫీసర్ విజయ్ కుమార్ పర్యవేక్షణలో జరిగింది. గ్రామసభలో పంచాయతీరాజ్ వ్యవస్థకు సంబంధించిన అంశాలతో పాటు త్రాగునీరు, విద్యుత్ దీపాలు, పారిశుద్ధ్యం, ఉపాధి హామీ వంటి ముఖ్య విషయాల పై విస్తృతంగా చర్చించారు. గ్రామ అభివృద్ధికి అవసరమైన పనులను పరిశీలించి, అధ్యక్షుల అనుమతితో పలు నిర్ణయాలు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, అధికారులు, గ్రామస్థులు పాల్గొని గ్రామసభను విజయవంతం చేశారు.

## మంత్రి సవితను కలిసిన ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు

**గురుకుల పాఠశాల భవన నిర్మాణానికి రూ.35 కోట్ల నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి**

**రజకుల దోబీ ఘాట్‌కు నిధులు కోరిన జీవీ ఆంజనేయులు**



(షణ్ముఖ వెలుగు, వినుకొండ, ఏప్రిల్ 24) వినుకొండ నియోజకవర్గ బీసీ వర్గాల అభ్యున్నతే ధ్యేయంగా ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు శుక్రవారం అమరావతిలోని సచివాలయంలో బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవితను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వినుకొండ పట్టణంలోని గంగినేని క్యాంపస్ ప్రైవేట్ భవనంలో నడుస్తున్న మహాత్మా జ్యోతిరావు పూలే బీసీ రెసిడెన్షియల్ గురుకుల పాఠశాలకు (బాయ్స్) సొంత భవనం నిర్మించాలని కోరుతూ ఆయన వినతిపత్రం అందజేశారు. చక్కవాగు వద్ద అందుబాటులో ఉన్న ప్రభుత్వ భూమిలో 35 కోట్ల రూపాయలతో ఈ భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. అలాగే, వినుకొండ మున్సిపాలిటీ పరిధిలోని రజకుల సౌకర్యార్థం ఆధునిక దోబీ ఘాట్ నిర్మాణానికి నిధులు కేటాయించాలని కోరారు. గతంలో తన విజ్ఞప్తి మేరకు బొల్లాపల్లి మండలంలో బీసీ బాలుర హాస్టల్ మంజూరు చేసినందుకు గాను మంత్రికి కృతజ్ఞతలు తెలియజేస్తూ, నియోజకవర్గంలోని బీసీల సమస్యలపై సుదీర్ఘంగా చర్చించారు. చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు విజ్ఞప్తులపై స్పందించిన మంత్రి సవిత నిధుల మంజూరుకు సానుకూలత వ్యక్తం చేశారు.

## పట్టుబడ్డ ఆరుగురు పేకాట రాయుళ్లు



(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, మార్కాపురం, ఏప్రిల్ 24) మార్కాపురం మండలం చింతగుంట్ల గ్రామ శివారు పొలంలో పేకాట ఆడుతున్న ఆరుగురి పై శుక్రవారం మార్కాపురం గ్రామీణ ఎస్ఐ వి వేమన తన సిబ్బందితో కలిసి దాడి చేశారు. ఈ దాడిలో వారి వద్ద నుంచి రూ.2,240 నగదు, 4 మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. ఈ ఘటన పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

## డిప్యూటీ ఎంపీడీవో శ్రీనివాస్‌కు ఉత్తమ అధికారిగా అవార్డు

**అవార్డును ప్రధానం చేసిన మంత్రి డోలా, కలెక్టర్, ఎంపి, ఎమ్మెల్యే**




(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, మార్కాపురం, ఏప్రిల్ 24) జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా శుక్రవారం ఒంగోలు కలెక్టర్ కార్యాలయంలో కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఉత్తమ సేవలు అందించినందుకు గాను పెద్దారవీడు మండల పరిషత్ డిప్యూటీ ఎంపిడిఓ వి శ్రీనివాస్ ఉత్తమ అధికారిగా ఎంపికయ్యారు. ఈ అవార్డును రాష్ట్ర సాంఘీక, సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి, ఎంపి మాగుంట శ్రీనివాసులురెడ్డి, ప్రకాశం జిల్లా కలెక్టర్ పి రాజాబాబు, ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్ చేతుల మీదుగా అందుకున్నారు. ఈ సందర్భంగా వారంతా శ్రీనివాస్‌కు ప్రత్యేక శుభాకాంక్షలు తెలియజేశారు.

# జీవనోపాధికి అటవీ హక్కులను కల్పించండి

ఇ(షణ్ముఖ వెలుగు, గిద్దలూరు, ఏప్రిల్ 24) వందల సంవత్సరాలుగా అటవీ మీద ఆధారపడుతున్న తమకు జీవనోపాధి కొరకు అటవీ హక్కులను కల్పించాలని రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ సొల్ల బొజ్జిరెడ్డి ని గిరిజనులు వేడుకున్నారు. శుక్రవారం గిద్దలూరు మండలంలోని దిగువమెట్ట తండాలో చెంచులతో ప్రత్యక్షన సంభాషణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా అనేక సమస్యలను వారు చైర్మన్ దృష్టికి తీసుకువచ్చారు. అటవీశాఖ ఏర్పడక ముందే గిరిజనులు అటవీ మీద ఆధారపడి జీవిస్తున్నారని కానీ అటవీ శాఖ అధికారులు అటవీలోకి వెళ్ళవద్దంటూ తమ మీద కేసులు బనాయించి తమ వృత్తి దెబ్బ కొడుతున్నారని వాపోయారు. ప్రభుత్వాలు మారుతున్న తమ జీవన విధానంలో ఎలాంటి మార్పులు రావడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. 2013లో గిరిజనులకు 5 ఎకరాల ఇస్తామని చెప్పి మొండి చేయి చూపారని వివరించారు. ఎస్టీ జాతుల్లో ఉన్న ఎరుకల యానాది, చెంచు, లంబాడిలకు అన్యాయం జరుగుతూనే ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. నల్లమల అడవి సమీపంలో ఉన్న తమను ఐటీడీఏ పరిధిలో చేర్చాలని చైర్మన్ కు తెలిపారు. అదేవిధంగా తండాల్లో పూర్తిస్థాయిలో సీసీ రోడ్లు, విద్యుత్, నీటి సౌకర్యాలు కల్పించాలన్నారు. స్వాతంత్రం వచ్చి దాదాపు 80 సంవత్సరాలు కావస్తున్నా తమ స్థితిగతుల్లో ఎలాంటి

**జీవనోపాధికి అటవీ హక్కులను కల్పించండి**

మాటలు రాలేదని వాపోయారు. అనంతరం ఎస్టీ కమిషన్ చైర్మన్ బొజ్జిబాబు మాట్లాడుతూ ఎస్టీల సమస్యల పరిష్కారం కోసమే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కమిషన్ ఏర్పాటు చేశాయని గిరిజనులు ధైర్యంగా ఉండాలన్నారు. సమస్యలను పరిష్కరించేందుకు దశల వారీగా ప్రత్యేక చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. అనంతరం గిరిజనులు అందించిన సమస్యలతో కూడిన వినతి పత్రాలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఎస్టి కమిషన్ సభ్యులు కే లక్ష్మి, కే మల్లేశ్వరరావు, పి వెంకటప్ప, శ్రీశైలం ఐటీడీఏ పీవో పీవీస్ నాయుడు, ఎస్టి కమిషన్ డిప్యూటీ డైరెక్టర్ కే సాంబయ్య, మార్కాపురం ఆర్‌డిఓ ప్రభాకర్, జిల్లా గిరిజన సంక్షేమశాఖ అధికారి వరలక్ష్మి, భాజపా రాష్ట్ర మీడియా అధికార ప్రతినిధి రామచంద్రరెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.








# దళిత క్రైస్తవులను ఎస్సీలుగా గుర్తించాలి

**అఖిలపక్ష పార్టీలు, గుడ్లూరు మండల పాస్టర్ ఫెలోషిప్ డిమాండ్**





(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, ఏప్రిల్ 24) అఖిలపక్ష పార్టీలు, గుడ్లూరు మండల పాస్టర్స్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో షెడ్యూల్ కులాలు ప్రజలు క్రైస్తవ మతంలోనికి మారితే రాజ కులం హోదా కోల్పోతారని సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు సమీక్ష చేయాలని, కేంద్ర ప్రభుత్వం ఫుల్ బెంచ్‌కు అప్పీల్‌కు వెళ్ళాలని, దళిత క్రైస్తవులను ఎస్సీలుగా గుర్తించాలని డిమాండ్ చేస్తూ గుడ్లూరు మండల తహసీల్దార్ కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వాళ్ళు మాట్లాడుతూ భారత అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు డివిజన్ బెంచ్ షెడ్యూల్ కులాల ప్రజలు క్రిస్టియన్ మతం లోనికి మారితే భారత రాజ్యాంగం వారికి కల్పించిన రక్షణ చట్టాలు కోల్పోతారని తీర్పు వెలువరించియున్నది. 42వ రాజ్యాంగ సవరణ ద్వారా భారతదేశాన్ని లౌకిక రాజ్యాంగ మార్చడం జరిగినది అదేవిధంగా రాజ్యాంగం కల్పించిన ఆర్టికల్ 25 ప్రకారం వ్యక్తులు తమకు నచ్చిన మతాన్ని స్వీకరించే హక్కును కల్పించారు. సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు భారత లౌకిక రాజ్యాంగ స్ఫూర్తి కి భిన్నమైనది. దళితులు షెడ్యూల్ కులాలు, షెడ్యూల్ తెగలు ప్రజలు క్రైస్తవ్యం తీసుకోవడం వలన సమాజములో వారు కులపరంగా ఎదుర్కొను వివక్షత, అంటరానితనం, అవమానాలు ఏమి రూపు మారటం లేదు సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు వలన దళితులపై కులపరమైన వేధింపులు అత్యాచారాలకు అడ్డుపడకపోగా ఎస్సీలకు సంక్రమించిన రక్షణ చట్టాలు కూడా హరించబడుతున్నాయి అందుకే షెడ్యూల్ కులాల ప్రజలకు క్రైస్తవంలో మారినప్పటికీ కూడా రాజ్యాంగం ఆర్టికల్ 15 లో కల్పించిన విధంగా రక్షణచట్టాలను అమలుచేయాలని కోరారు. ఈ విషయమును కేంద్ర ప్రభుత్వం సుప్రీంకోర్టు ఫుల్ బెంచ్ అప్పీల్ కి వెళ్లి షెడ్యూల్ కులాల ప్రజల పట్ల వారి హక్కులను కాపాడే విధంగా చర్యలు తీసుకొవాలని కోరారు. మీ వినతిని తప్పక ప్రభుత్వానికి తెలియజేస్తాను అని తహసీల్దార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో గుడ్లూరు మండల పాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్షులు జె జార్జి పాస్టర్స్ అనిల్ కుమార్, పి యోహాన్, జి శిఖామణి, జి మెతుషలా, జి కృపారావు, పి జార్జి, కే కుమార్, బి తిరుపాలు, జి కృపాదానం, ఏ మోషే, స్టీఫెన్ పాల్, కే ఆనంద కుమార్, వై సామేలు, సంతోష్ కుమార్, దేవరాజు, ఇశ్రాయేలు, ఆంద్రేయ, వై నాగేశ్వరరావు, ఎస్ ప్రభాకర్, తాటిపర్తి రమేష్, తదితరులు పాల్గొన్నారు.

# పేకాట శిబిరంపై దాడి



(షణ్ముఖ వెలుగు, పొన్నలూరు, ఏప్రిల్ 24) మండలంలోని మాలపాడులో పేకాట ఆడుతున్న ఇద్దరు వ్యక్తులను శుక్రవారం పోలీసులు అదుపులో తీసుకున్నారు. స్థానికులు సమాచారం ఇవ్వడంతో పోలీసులు పేకాట శిబిరంపై దాడి చేసి ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసి వారి వద్ద నుండి రూ 2140 నగదు, రెండు సెల్ ఫోన్లు స్వాధీనపరుచుకున్నారు. ఎస్ఐ పి సత్యనారాయణ మాట్లాడుతూ ఎవరైనా అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడిన కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

# చిన్నగంజాంలో గ్రామసభ నిర్వహణ

# ప్రత్యేక అధికారిణి ధనలక్ష్మిని సన్మానించిన రామసుబ్బరావు

(షణ్ముఖ వెలుగు, చిన్నగంజాం, ఏప్రిల్ 24) గ్రామాల్లో ఏమేమి అభివృద్ధి పనులు అవసరం, ప్రజలు ఏమి కోరుకుంటున్నారు అనే అంశాలపై ఈ గ్రామసభల్లో చర్చించటం జరిగిందని మండల ఎంపిడిఓ, గ్రామ ప్రత్యేక అధికారి కె ధనలక్ష్మి అన్నారు. శుక్రవారం జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా చిన్నగంజాం గ్రామపంచాయతీ కార్యాలయం నందు పంచాయతీ ప్రత్యేక అధికారి కే ధనలక్ష్మి అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. కూటమి ప్రభుత్వం కొలువుదీరాక పంచాయతీలకు జవసత్వాలు అందించడంపై ప్రభుత్వం దృష్టాపెట్టటంతో మంచి ఆలోచనలతో, నిర్ణయాలతో ముందడుగు వేసేందుకు గ్రామ సభ వేదికగా పలు అభివృద్ధి అంశలపై చర్చ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం అనంతరం ప్రత్యేక అధికారి ధనలక్ష్మి తెలుగుదేశం పార్టీ బాపట్ల పార్లమెంట్ వాణిజ్య విభాగ ఉపాధ్యక్షుడు మోటుమర్రి రామసుబ్బారావు శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ లక్ష్మీదేవి, తెలుగుదేశం పార్టీ బాపట్ల పార్లమెంట్ అధికార ప్రతినిధి సయ్యద్ అబ్దుల్ కలాంఆజాద్, మాజీ చింతగుంపల సొసైటీ ప్రెసిడెంట్ తుమ్మలపెంట జయరావు, నియోజకవర్గ టిఎన్‌సియుసి అధ్యక్షులు నరహరి శ్రీనివాసరావు, చింతగుంపుల సొసైటీ డైరెక్టర్ సందు శ్రీనివాసరావు, మైనార్టీ సెల్ అధ్యక్షులు షేక్ జిలాని, టిడిపి సీనియర్ నాయకులు శిఖరం సూరిబాబు, పంచాయతీ సిబ్బంది సుదీర్, మాణిక్యరావు, ఫణీంద్ర, తదితరులు పాల్గొన్నారు.






## సీఎం సహాయనిధి చెక్కులు పంపిణీ చేసిన కందుల వసంతలక్ష్మి






**(షణ్ముఖ వెలుగు, తర్లుపాడు, ఏప్రిల్ 24)**

మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు సీఎం సహాయనిధి చెక్కులను శుక్రవారం మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి ఆదేశాల మేరకు ఆయన సతీమణి కందుల వసంత లక్ష్మి పంపిణీ చేశారు. చెక్కులు అందుకున్న వారిలో గడ్డం శివమణి (చెన్నారెడ్డిపల్లి) రూ.30,395, కొమ్ము కొండయ్య (జంగంరెడ్డిపల్లె) రూ.36,084, చింతలపూడి సురేష్ (రోలుగుంపాడు) రూ.44,577, గోసు నాగేశ్వరరావు (తర్లుపాడు) రూ.30,000, మారంరెడ్డి ఆదిలక్ష్మి (తుమ్మలచెరువు) రూ.27,348లు వెరసి మొత్తం రూ.1,68,404ల చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక టిడిపి నేతలు పాల్గొన్నారు.

## రైల్వే వంతెనల నిర్మాణం, స్టేషన్ల అభివృద్ధి పనుల పై ఎంపీ మాగుంట సమీక్ష




**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఏప్రిల్ 24)**

ఒంగోలులోని ఎంపీ కార్యాలయంలో ఎంపీ కార్యాలయంలో కరవది, ఒంగోలు, సూరారెడ్డిపాలెం, టంగుటూరు, ఎస్.కొండ రైల్వే స్టేషన్ల పరిధిలోని రైల్వే వంతెనల నిర్మాణం, స్టేషన్ల అభివృద్ధి పనులపై రైల్వే అధికారులతో ఒంగోలు ఎంపి మాగుంట శ్రీనివాసులురెడ్డి కార్యాలయంలో శుక్రవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమీక్షలో ఒంగోలు ఎంపి మాగుంట శ్రీనివాసులురెడ్డి, కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి, రైల్వే సీనియర్ డివిజనల్ ఇంజనీర్ కేడీఎస్ కృష్ణ, చీఫ్ ఇంజనీర్ రమణ, పలువురు రైల్వే అధికారులు, మండల తహసీల్దార్లు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# పేదవాడు కడుపునిండా అన్నం తినాలనే అన్న క్యాంటీన్ ఏర్పాటు

## ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌రావు

**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఏప్రిల్ 24)**

పేదవాడు కడుపునిండా అన్నం తినాలని ఉద్దేశంతో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అన్న క్యాంటీన్ ఏర్పాటు చేశారని, ఆ అన్నా క్యాంటీన్లో దాతలు ముందుకు వచ్చి పేదలకు ఉచితంగా భోజనాన్ని అందించడం అభినందనీయమని స్థానిక ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్‌రావు అన్నారు. నగరంలోని కలెక్టరేట్‌కి సమీపంలో గల అన్న క్యాంటీన్లో బుర్ర పూర్ణచంద్రరావు జ్ఞాపకార్థం వారి కుమారుడు చంద్రశేఖర్ ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పూర్ణచంద్రరావు ఉద్యోగ సంఘ నాయకుడుగా పనిచేశాడని వారు కుమారుడు వాళ్ళ నాన్న గుర్తుగా నగరంలోని నాలుగు అన్న క్యాంటీన్లలో 32 వేల రూపాయలు నగదును అందించి గురువారం అంతా పేదలకు మూడు పూటలు ఉచితంగా భోజనాలు కల్పించారని అన్నారు. పేదలకు అన్న క్యాంటీన్ ద్వారా ఐదు రూపాయలకే నాణ్యమైన భోజనాన్ని అందిస్తున్నామని దాతలు కూడా ముందుకు వచ్చి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పూర్ణచంద్ర కుటుంబ సభ్యులు, తెలుగుదేశం పార్టీ నాయకులు గొల్లపూడి బాబురావు, కాశీ రావు, గడ్డం ఆదినారాయణ, దాయినేని ధర్మ, తంజావూరి శ్రీనివాసరావు, తదితర స్థానిక నాయకులు పాల్గొన్నారు.






# జార్జి అటానమస్ ఇంజనీరింగ్ కళాశాలలో ఘనంగా 26వ గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమం




**(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, మార్కాపురం, ఏప్రిల్ 24)**

స్థానిక డాక్టర్. శ్యామ్యూల్ జార్జ్ అటానమస్ ఇంజనీరింగ్ కళాశాలలో 2022 బ్యాచ్ విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆర్‌జేయుకేటి ఇడుపులపాయ, ఒంగోలు డైరెక్టర్ డాక్టర్ ఏవీఎస్ఎస్ కుమారస్వామి గుప్త, కళాశాల సాంకేతికత సలహాదారు మాజీ మంత్రి డాక్టర్ సురేష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా 22 బ్యాచ్ చదువు ముగించిన విద్యార్థులకు గ్రేడియేషన్ సర్టిఫికెట్స్ ని ప్రధానం చేశారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి డాక్టర్ ఏవీఎస్ఎస్ కుమారస్వామి గుప్తా మాట్లాడుతూ విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో సమాజంలోనికి అడుగు పెట్టాలని, సమాజానికి మంచి పౌరులుగా సేవలు అందించాలని, లెర్నింగ్ అనేది నిరంతర ప్రక్రియ అని, ఉద్యోగార్థులు కాకుండా ఉద్యోగాలు ఇచ్చే వారుగా తయారు కావాలని పిలుపునిచ్చారు. మాజీ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ మాట్లాడుతూ 26వ గ్రాడ్యుయేషన్ డే నిర్వహించడం చాలా గర్వకారణంగా ఉందన్నారు. మా మీద నమ్మకం ఉంచి విద్యార్థులను కళాశాలలో చేర్పించి వారికి మంచి భవిష్యత్తును ఇవ్వడానికి అవకాశం ఇచ్చిన తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ సయ్యద్ ఖాసిం, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ రాజబాబు, డీన్ అకాడమిక్స్ డాక్టర్ మస్తానయ్య, డైరెక్టర్ డాక్టర్ డానియల్, సిఎస్సి విభాగాధిపతి డాక్టర్ పి పి సాధు నాయక్, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.




## ఉత్తమ అధికారిగా అవార్డు అందుకున్న ఎంపిడిఓ జాన్ సుందరం



**(షణ్ముఖ వెలుగు, పెద్దారవీడు, ఏప్రిల్ 24)**

జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా శుక్రవారం ఒంగోలులో జరిగిన కార్యక్రమంలో పెద్దారవీడు మండల పరిషత్ అభివృద్ధి అధికారి జాన్ సుందరంకు ఉత్తమ అధికారి అవార్డు దక్కింది. ఈ అవార్డును జిల్లా ఎంజిఎన్ఆర్ఇజిఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ జోసఫ్ కుమార్ ఎంపిడిఓకు అవార్డు ప్రధానం చేసి శుభాకాంక్షలు తెలిపారు.

## హెల్మెట్‌తోనే ప్రాణ రక్షణ సీఐ సుధాకర్



**(షణ్ముఖ వెలుగు, చీరాల, ఏప్రిల్ 24)**

వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించి ప్రయాణిస్తే రోడ్డు ప్రమాదాల తీవ్రతను గణనీయంగా తగ్గించవచ్చని చీరాల రూరల్ సీఐ ఉప్పుటూరి సుధాకర్ అన్నారు. బాపట్ల జిల్లా ఎస్పీ ఉమామహేశ్వర్ ఆదేశాల మేరకు, డీఎస్పీ ఎండి మోయిన్ ఆధ్వర్యంలో శుక్రవారం వేటపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో 'శిరోరక్ష-ప్రాణ రక్ష' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ జనార్ధన్‌తో కలిసి వాహనదారులకు హెల్మెట్ ప్రాధాన్యం, రోడ్డు భద్రతా నిబంధనలపై అవగాహన కల్పించారు. ప్రమాదాల నివారణకు జాగ్రత్తలు పాటించాలని సూచించారు.

## అన్నవరం దేవస్థాన పాలకమండలి సభ్యురాలు అనంతమ్మకు శుభాకాంక్షలు



**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఏప్రిల్ 24)**

ప్రముఖ పుణ్యక్షేత్రమైన అన్నవరం దేవస్థానం పాలకమండలి సభ్యురాలిగా శుక్రవారం ఆమె ఆలయ ప్రాంగణంలో అట్టహాసంగా ప్రమాణస్వీకారం చేశారు. ఈ సందర్భంగా ఒంగోలుకు చెందిన టిడిపి నేతలు ఆమెకు అభినందనలు తెలియజేశారు. అభినందనలు తెలిపిన వారిలో కామేపల్లి శ్రీనివాసరావు, కొఠారి నాగేశ్వరరావు, ఆర్ల వెంకటరత్నం, నాలం నరసమ్మ, రావుల పద్మజ, గంగవరం పద్మ, బెజవాడ మురళీకృష్ణ, బొడ్డపాటి వెంకట్, వివిధ కమిటీలకు చెందిన నాయకులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆంగ్ల భాషా దినోత్సవం




**(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, ఏప్రిల్ 24)**

ఉలవపాడు జీవీఎస్ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం రోజున ప్రతి ఏటా ఏప్రిల్ 23న ఐక్యరాజ్య సమితి ఆధ్వర్యంలో "ఇంగ్లీష్ భాషా దినోత్సవం" నిర్వహిస్తారు. ఆంగ్ల మహాకవి విలియం షేక్స్పియర్ జనన, మరణ దినం పురస్కరించుకొని ఈ తేదీని 2010లో యునెస్కో ప్రకటించింది. ఈ సందర్భంగా ఉలవపాడు జీవీఎస్ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఇంగ్లీష్ విభాగం ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాలు జరిగాయి. ఇన్‌ఛార్జ్ ప్రిన్సిపాల్ డాక్టర్ జి సుజాత అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఇంగ్లీష్ లెక్చరర్ డాక్టర్ వి శివ ప్రసన్న కుమార్ వక్తగా పాల్గొన్నారు. అధ్యాపక సిబ్బంది, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. డాక్టర్ సుజాత మాట్లాడుతూ "ఇంగ్లీష్ నేడు జ్ఞానానికి, ఉద్యోగ అవకాశాలకు వారధి" అన్నారు. వ్యాసరచన, వక్తృత్వ పోటీలు, ఎల్ఎస్ఆర్‌డబ్ల్యూ వర్క్‌షాప్, ది గ్లోబ్ వాల్ మ్యాగజైన్ ఆవిష్కరణ జరిగాయి. షేక్స్పియర్‌ను స్మరించుకుంటూ విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు.

## ప్రకృతి వ్యవసాయం పై అవగాహన



(షణ్ముఖ వెలుగు, పొన్నలూరు, ఏప్రిల్ 24)
మండలంలోని రావలకొల్లు గ్రామంలో రైతు సాధికార సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం ప్రకృతి వ్యవసాయంపై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ అధికారి వి రాము మాట్లాడుతూ పకృతి వ్యవసాయ సిబ్బందికి రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించి ప్రకృతి వ్యవసాయ పద్ధతుల ద్వారా వివిధ పంటలు పండించాలని తెలిపారు.నారుమడి తయారీ విధానం, వేసవి దుక్కులు గురించి వివరించారు. అలాగే భూమిలో పోషకాలు నత్రజని పెంపొందించడానికి పచ్చిరొట్ట విత్తనాలు, నవధాన్యాల ఉపయోగాలను తెలిపారు. రసాయినిక ఎరువులు బదులుగా ప్రకృతి వ్యవసాయం ద్వారా ఘనజీవామృతం, ద్రవజీవామృతం ఉపయోగించాలన్నారు. పురుగు మందులు బదులుగా కషాయాలు నీమాస్త్రం, బ్రహ్మాస్త్రం, అగ్నిస్త్రం, పంచపత్రిక కసాయం తయారు చేసి వాటిని ఉపయోగించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో విస్తరణ అధికారి ఈ సుధీర్, ఎస్తర్ రాణి, డి మందాకిని, పకృతి వ్యవసాయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## పర్మిషన్ లేని ఎగ్జిబిషన్ల పై చర్యలు తీసుకోండి

### అధికారులకు ఎగ్జిబిషన్ నిర్వాహకుల విన్నపం




(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఏప్రిల్ 24)
ఒంగోలు నగరంలో ఎటువంటి అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న ఎగ్జిబిషన్ల పై అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని ఎగ్జిబిషన్ నిర్వాహకులు ఈదుపల్లి శివ అధికారులను కోరారు. ఒంగోలులోని ఎంసీఏ భవన్లో శుక్రవారం నిర్వహించిన మీడియా సమావేశంలో శివ మాట్లాడుతూ గత 40 సంవత్సరాలుగా ఒంగోలులో ఎగ్జిబిషన్లు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఈ పాటికి తమ్ముడు కొత్త మార్కెట్ పక్కన ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేశామన్నారు. అలాగే రవి ప్రియ మాల్ ఎదుట మరో వ్యక్తి అన్నీ అనుమతులతో ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేశారన్నారు. మంగమ్మ కాలేజీ వద్ద మరో వ్యక్తి ఎటువంటి అనుమతులు లేకుండా ఫేక్ డాక్యుమెంట్లతో ఎగ్జిబిషన్లను ఏర్పాటు చేస్తున్నారన్నారు. ఒంగోలు ఎక్కువ ఎగ్జిబిషన్లను ఏర్పాటు చేసే స్థాయి కాదన్నారు. మున్సిపల్, పోలీస్, ఫైర్, ఎమ్మెల్యే అనుమతి పత్రంతో తాము ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేస్తుంటే ఎటువంటి అనుమతులు లేకుండా మంగమ్మ కాలేజీ సెంటర్లో ఎగ్జిబిషన్ ఏర్పాటు చేయడం తగదని హితవు పలికారు. ఇప్పటికైనా అధికారులు వెంటనే జోక్యం చేసుకొని ఆ ఎగ్జిబిషన్ ప్రారంభం కాకుండా అడ్డుకోవాలని కోరారు. సమావేశంలో ఎగ్జిబిషన్ నిర్వాహకులు వల్లంశెట్టి శ్రీనివాసరావు, మద్దులూరి సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

# ఇంటర్ సెకండియర్‌లో టౌన్ టాపర్‌గా నిలిచిన మెంట బాలాజీని అభినందించిన మున్సిపల్ మాజీ చైర్మన్

### సానపురెడ్డి రాధాకృష్ణారెడ్డి సహకారంతో రూ.10వేల నగదు ప్రోత్సాహం

### బాలాజీకి వస్త్రాలు అందజేస్తూ అభినందించిన టీవీ శివనారాయణ

(షణ్ముఖ వెలుగు, బద్వేల్, ఏప్రిల్ 24)
ఇటీవల రాష్ట్రవ్యాప్తంగా వెలువడిన ఇంటర్మీడియట్ సెకండియర్ ఫలితాలలో బద్వేల్ పట్టణంలోని గౌతమ్ జూనియర్ కళాశాలలో చదివిన మెంటా బాలాజీ 1000 మార్కులకు గాను 988 మార్కులు సాధించి టౌన్ టాపర్ గా నిలిచారు. విషయం తెలుసుకున్న బోవిల్లా వారి పల్లె గ్రామానికి చెందిన ప్రముఖ పారిశ్రామికవేత్త సానపురెడ్డి రాధాకృష్ణారెడ్డి వారి తండ్రి కీర్తిశేషులు సానపరెడ్డి గోపాల్ రెడ్డి జ్ఞాపకార్థం ఇంటర్ ఫలితాలలో బద్వేల్ టౌన్ టాపర్‌గా నిలిచిన మెంట బాలాజీని శుక్రవారం సాయంత్రం మాజీ మున్సిపల్ చైర్మన్ వాకమల్ల రాజగోపాల్ రెడ్డి, వైస్ చైర్మన్ రాచపూడి వెంకట సాయి కృష్ణ ఇరువురు శాలువాతో సత్కరించారు. విద్యార్థిని అభినందిస్తూ భవిష్యత్తులో ఇటువంటి ర్యాంకులు మరెన్నో సాధించి ఉన్నత స్థాయికి చేరుకోవాలని వారు స్వీట్ తినిపించి అభినందించారు. అలాగే బాలాజీ ఇంతటి మార్కులు సాధించడానికి కృషిచేసిన గౌతమ్ జూనియర్ కళాశాల ఆధ్యాపక బృందానికి, వారి తల్లిదండ్రులు మెంట సురేష్‌బాబు, నాగమణి, కుమారుడు మెంట బాలాజీ కుటుంబ సభ్యులను మున్సిపల్ చైర్మన్ రాజగోపాల్ రెడ్డి వైస్ చైర్మన్ వాళ్ళతో సత్కరించి వారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య ప్రముఖులు సత్య టౌన్షిప్ అధినేత సముద్రాల సుబ్బారావు (గురు), రాచపూడి వెంకటరత్నం, మాజీ మార్కెట్ యార్డ్ డైరెక్టర్ పబ్బతి చంద్రశేఖర్, విద్యావేత్త సివి నాగేశ్వరరావు, పబ్బతి సత్యనారాయణ, తుమ్మలపెంట సురేష్‌బాబు, యల్లనూరు వెంకటరమణ, ప్రతాప్ సాయితో పాటు పలువురు పాల్గొన్నారు.





# రైతు సేవా కేంద్ర, ప్రకృతి వ్యవసాయ సిబ్బందికి రెండు రోజుల శిక్షణ




(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, ఏప్రిల్ 24)
మండల కేంద్రమైన ఉలవపాడు 3 రైతు సేవ కేంద్రం నందు శుక్రవారం రైతు సాధికార సంస్థ, ప్రకృతి వ్యవసాయ విభాగం ఆధ్వర్యంలో రైతు సేవా కేంద్ర, ప్రకృతి వ్యవసాయ సిబ్బందికి రెండు రోజుల శిక్షణ కార్యక్రమం ప్రారంభించారు. మొదటి రోజు శిక్షణలో భాగంగా అలగాయ పాలెంలోని ప్రకృతి సాగు చేయు పంట పొలాలను సందర్శించడం జరిగింది. ఈ కార్యక్రమం లో మండల వ్యవసాయాధికారి డి విజయకుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రబీ పంట కోసిన వరి, వేరుశనగ పొలాలలో మిగిలిన తేమ ను ఉపయోగించుకొని (ప్రీ మాన్సూన్ డ్రై సోయింగ్) కిట్స్ విత్తనాలను ఎకరాకు 15 కేజీల చొప్పున చల్లాలని, ఈ కిట్లలో 30 రకాల పప్పు దాన్యాల కు, చిరు ధాన్యాలకు, తీగ జాతి, నూనె గింజలకు సంబందించిన విత్తనాలు ఉంటాయి అని వీటి ద్వారా అధిక ఆదాయంతో పాటు 45 రోజుల తర్వాత దున్నినట్లయితే భూమి గుల్లబారి, భూసారం పెరిగి, ప్రధాన పోషకాలు అంది ప్రధాన పంట ద్వారా అధిక దిగుబడులు పొందవచ్చునని, కావున ప్రతి రైతు ్రావీణూ కిట్స్ వాడాలని, కావలసిన వారు మీ గ్రామంలోని రైతు సేవా కేంద్ర సిబ్బందిని సంప్రదించాలని తెలియజేసారు. ఈ కార్యక్రమంలో కందుకూరు డివిజన్ మాస్టర్ ట్రైనీ సునీత, ఖీమీ రేవతి, రమేష్, అరుణ, రైతుసేవా కేంద్ర సిబ్బంది పాల్గొన్నారు.






## జేఎంబి చర్చి పులిపీట్‌ను ఆగస్టిన్ అప్రతిష్ట పాలు చేశారు

### చర్చి బైలా ప్రకారం 70 సంవత్సరాలు దాటిన వ్యక్తి పాస్టర్‌గా పని చేయడానికి వీలు లేదు

### కోర్టు ఆదేశాలు ఉంటే మేనేజ్మెంట్‌ను కలవాలే తప్ప సొంత నిర్ణయాలు తీసుకోకూడదు

### మీడియా సమావేశంలో పాస్టర్ జాన్ కెనడి వెల్లడి




(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఏప్రిల్ 24)
కోర్టు ఆదేశాలంటూ అగస్టిన్ చర్చి పులిపీట్ ప్రతిష్ట దిగజార్చారని జేఎంబి చర్చ్ పాస్టర్ జాన్ కెనడి పేర్కొన్నారు. స్థానిక జేఎంబి చర్చి ఆవరణంలో శుక్రవారం ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కెనడి మాట్లాడుతూ మాజీ పాస్టర్ అగస్టిన్ ఒక పెయిడ్ సేవకులు మాత్రమే అన్నారు. అతడికి మేనేజ్మెంట్ వ్యవహారాలలో తలదుర్చే అర్హత లేదన్నారు. గతంలో హైకోర్టు అగస్టిన్ కేవలం పెళ్లిళ్లు, సమాధులు చేయడం వరకే పనిచేయాలని, ప్రార్థనలు చేయకూడదని, పులిపీట్‌కు దూరంగా ఉండాలని ఆదేశాలు జారీ చేసిందన్నారు. అప్పటి నుండి ఆగస్టిన్ చర్చికి దూరంగా ఉంటూనే ఉన్నారన్నారు. అయితే ఇటీవల కోర్టు అతనిని పాస్టర్‌గా ఉండేలా ఆదేశాలు జారీ చేసిందన్నారు. కోర్టు ఆదేశాలను చర్చి మేనేజ్మెంట్ వద్దకు తీసుకురాకుండా సొంతంగా సమావేశాలు ఏర్పాటు చేసుకొని డాన్సులు వేస్తూ, టపాసులు పేలుస్తూ పులిపీట్ ఎక్కటం ఎంతవరకు సబబు అని ప్రశ్నించారు. చర్చి బైల ప్రకారం 70 సంవత్సరాలు నిండిన వ్యక్తిని పాస్టర్‌గా కొనసాగనివ్వకూడదని తెలిపారు. అదే విషయం పై తాము కోర్టుకు వెళ్ళామన్నారు. అనుమతులు లేకుండా, మేనేజ్మెంట్ ఆదేశాలు లేకుండా అగస్టిన్ పులిపిట్ ఎక్కి ప్రార్థనలను చేయకూడదని పేర్కొన్నారు. ఈ సమావేశంలో పాస్టర్ జాన్ కెనడి వర్గ సభ్యులు పాల్గొన్నారు.

## ఐటీఎస్ఈ-ఇన్నోవేటివ్ టాలెంట్ సెర్చ్‌లో ఉలవపాడు శ్రీ సాయి విద్యార్థులు




(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, ఏప్రిల్ 24)
ఐ టీ ఎ స్ ఈ - 2 0 2 6 నిర్వహించిన నేషనల్ లెవెల్ మ్యాథమెటిక్స్, ఇంగ్లీష్, సైన్స్ ఎగ్జామినేషన్ లో శ్రీ సాయి విద్యార్థులు ప్రధమ,ద్వితీయ, తృతీయ బహుమతులు సాధించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ కెవి శేషమ్మ మాట్లాడుతూ విద్యార్థులు




స్కూల్ లెవెల్ లో మాత్రమే కాకుండా బయట కండక్ట్ చేసే ఎగ్జామ్స్‌లో కూడా పాల్గొని విద్యార్థులు తమ సత్తా చాటుకోవాలని సూచించారు. నేషనల్ లెవెల్‌లో కనపరచిన ప్రతిభకు వారిని ప్రశంసించారు. ప్రిన్సిపల్ మోనికా మాట్లాడుతూ విద్యార్థులు విశేష ప్రతిభ కనబరిచి గోల్డ్, సిల్వర్, బ్రాంజ్ పథకాలను గెలుచుకొని శ్రీ సాయి స్కూల్‌కి గౌరవాన్ని తీసుకొచ్చినందుకు వారిని ప్రశంసించారు.

## బైక్ మెకానిక్ మేస్త్రి శివారెడ్డి కి నివాళులు

### మండల ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు




(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, ఏప్రిల్ 24)
మండల బైక్ మెకానిక్ యూనియన్ అధ్యక్షుడు బుధవారం చాకీచెర్ల పెదపట్టపుపాలెం నుండి ఉలవపాడు వస్తుండగా మార్గమధ్యలో ప్రమాదానికి గురయ్యాడు. అనంతరం అయనను ఒంగోలులోనే ఒక ప్రైవేట్ వైద్యశాలకు తరలించగా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరణించాడు. ఆయనకు ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా తరపున అశ్రునివాళి అర్పిస్తున్నాం, వారి కుటుంబానికి మండల ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు ప్రగాఢ సానుభూతి తెలిపారు.





# తర్లుపాడులో తప్పిన రైలు ప్రమాదం

# గూడ్స్ రైలులో పొగలు

(షణ్ముఖ వెలుగు, తర్లుపాడు, ఏప్రిల్ 24)
మార్కాపురం జిల్లా తర్లుపాడు రైల్వే స్టేషన్‌లో శుక్రవారం ఒక భారీ ప్రమాదం తప్పింది. బొగ్గు లోడుతో వెళ్తున్న గూడ్స్ రైలులో ఒక్కసారిగా పొగలు రావడంతో రైల్వే అధికారులు, స్థానికులు అప్రమత్తమయ్యారు.

**అసలేం జరిగిందంటే?** బొగ్గును రవాణా చేస్తున్న గూడ్స్ రైలు తర్లుపాడు స్టేషన్ పరిధిలోకి రాగానే, అందులోని ఒక బోగీలో ఉన్న బొగ్గు నుంచి దట్టమైన పొగలు రావడం గమనించారు. వెంటనే రైలును నిలిపివేసిన సిబ్బంది, మార్కాపురం అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించారు.

**సకాలంలో స్పందించిన ఫైర్ సిబ్బంది :** సమాచారం అందుకున్న వెంటనే మార్కాపురం ఫైర్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకున్నారు. మంటలు వ్యాపించకుండా ఉండేందుకు బోగీలో డ్రై కెమికల్ పౌడర్‌ను చల్లి పొగలను అదుపు చేశారు. పొగలు పూర్తిగా ఆగిపోయి, పరిస్థితి అదుపులోకి వచ్చే వరకు అగ్నిమాపక సిబ్బంది అక్కడే ఉండి పర్యవేక్షించారు.

**తప్పిన ముప్పు :** అగ్నిమాపక సిబ్బంది సకాలంలో స్పందించి చర్యలు తీసుకోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. దీంతో రైల్వే అధికారులు, ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు. బొగ్గులో ఏర్పడిన వేడి కారణంగానే ఈ పొగలు వచ్చినట్లు ప్రాథమికంగా భావిస్తున్నారు.


On behalf of PRINTER, PUBLISHER OWNED BY OBULASETTY RADHAKRISHNA DASS AND PRINTED AT HARI PRINTERS AND PUBLICATIONS, FLOT 51, NEAR B.V.SUBBAIAH SCHOOL ROAD, PERNAMITTA, SANTANUTALAPADU (MANDAL), PRAKASAM/ONGOLE (Dt), ANDHRA PRADESH, PIN : 523225. Mobile : 9494177939, RNI : APTEL/2023/89152, e-mail : rkreport9@gmail.com. E-Paper : shanmukhavelugu.com